# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :232 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: ఆదివారం 23-11-2025 | పేజీలు:4 వెల: 2.00


## భారీగా పెరిగిన యాదాద్రి ఆదాయం

యాదాద్రి, కార్తీక మాసం నేపథ్యంలో యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామిని భారీగగా భక్తులు దర్శించుకున్నారు. దేవాలయంలో భక్తుల రద్దీ ఎప్పటిలాగే భారీ స్థాయిలో నమోదైంది. ఈ మాసంలో స్వామివారిని దర్శించుకున్న భక్తుల సంఖ్య 20 లక్షల 52 వేల దాటింది. భక్తుల సంఖ్య పెరగడంతో దేవాలయ ఆదాయం కూడా గణనీయంగా పెరిగింది.

ఈ కార్తీక మాసంలో యాదాద్రికి వచ్చిన మొత్తం ఆదాయం రూ.17 కోట్లు 62 లక్షలు 33 వేల 331. గతేడాది ఇదే కాలంలో వచ్చిన ఆదాయం రూ. 14 కోట్లు 30 లక్షలు 69 వేల 481. అంటే ఈసారి గతేడాదితో పోలిస్తే రూ. 3 కోట్లు 31 లక్షలు 63 వేల 850 అదనపు ఆదాయం స్వామివారి దేవాలయానికి వచ్చింది. అధిక భక్తులు, సేవలు, విరాళాలు, ప్రాసాద అమ్మకాల కారణంగా ఆదాయం పెరిగిందని దేవస్థానం అధికారులు పేర్కొంటున్నారు. కార్తీక మాసంలో యాదాద్రి యాత్రకు భక్తుల విశ్వాసం, ఆసక్తి ఏ స్థాయిలో ఉందో ఈ సంఖ్యలు మరోసారి రుజువు చేస్తున్నాయి.

## సైబర్ నేరాలపై అవగాహన, అప్రమత్తత ఉండాల్సిందే: సీపీ సజ్జనార్



హైదరాబాద్, నవంబర్ 22: సైబర్ నేరాలను అడ్డుకునేందుకు సరికొత్త కార్యక్రమానికి హైదరాబాద్ సీపీ సజ్జనార్ శ్రీకారం చుట్టారు. చార్మినార్ వద్ద నేరాలపై అవగాహన కల్పించే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సీపీ మీడియాతో మాట్లాడుతూ.. చారిత్రాత్మక చార్మినార్ వద్ద ప్రతి శని, మంగళవారం గడపగడపకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. చార్మినార్ వద్ద ఇవాళ సైబర్ క్రైమ్‌పై అవేర్‌నెస్ కార్యక్రమం ఏర్పాటు చేసి అవగాహన కల్పించే ప్రయత్నం చేశామన్నారు. అవగాహన లేక చాలామంది సైబర్ నేరాల బారిన పడుతున్నారని తెలిపారు. ఒక్క హైదరాబాద్‌లోనే ప్రతి రోజు కోటి రూపాయలు సైబర్ నేరాల్లో పోగొట్టుకుంటున్నారని వెల్లడించారు. ఓటీపీ ఇన్వెస్ట్‌మెంట్, డిజిటల్ అరెస్ట్ అంటూ సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారని తెలిపారు. సైబర్ నేరాల పట్ల అందరూ అవగాహన, అప్రమత్తత కలిగి ఉండాలని సూచించారు. సైబర్ నేరస్తులు కాల్ చేసి బెదిరిస్తే భయపడవద్దన్నారు. భయపడితే అది సైబర్ నేరస్తుల బలం అవుతుందని చెప్పుకొచ్చారు. ప్రైవేట్ ఫోటోలు సోషల్ మీడియాలో అప్లోడ్ చేయవద్దని.. అలా చేస్తే మిమ్మల్ని ట్రాప్ చేసి మోసం చేసే అవకాశం ఉందన్నారు. సైబర్ నేరాల బారిన పడితే వెంటనే 1930 కి కాల్ చేయాలని సూచించారు. సైబర్ సింబా పేరిట వాలంటరీ వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చామని.. ఇందులో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సీపీ సజ్జనార్ పిలుపునిచ్చారు.

## ఫిరాయింపుల ఎపిసోడ్‌లో కొత్త ట్విస్ట్..

హైదరాబాద్, ఎనిమిది మంది సేఫ్. ఇద్దరిపై వేటు. వాళ్లిద్దరు అయితే రాజీనామానో? లేక అనర్హత ఖాయమంటూ ప్రచారం జరిగింది. ఓవైపు సుప్రీం ఆర్డర్స్, ఇంకోవైపు ఎమ్మెల్యేల క్రాస్ ఎగ్జామినేషన్.. లేటెస్ట్‌గా ఇద్దరు ఎమ్మెల్యేలకు మళ్లీ నోటీసులు..ఇలా ట్విస్ట్‌ల మీద ట్విస్టులతో రోజుకో అప్ డేట్ హాట్ టాపిక్ అవుతోంది. ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరికి స్పీకర్ మళ్లీ నోటీసులు ఇవ్వడం చర్చకు దారితీస్తోంది. ఆ ఇద్దరు త్వరలో రిజైన్ చేస్తారన్ టాక్ వినిస్తుండగా..మళ్లీ నోటీసులు సర్వ్ చేయడం వెనుక ఓ రీజన్ ఉందనే చర్చ జరుగుతోంది. పది మందిలో ఎంతమంది సేఫ్? రాజీనామాకు సిద్ధంగా ఉన్నదెవరు? వేటు పడేది ఎవరిపై?తెలంగాణలో జంపింగ్ ఎమ్మెల్యేల ఇష్యూ.. రింగా రింగా తిరుగుతోంది. కోర్టు టు స్పీకర్..స్పీకర్ టు ఎమ్మెల్యేస్..మధ్యలో బీఆర్ఎస్ లీగల్ ఫైట్..ఇలా రోజుకో టర్న్ తీసుకుంటూ సరిపోదా సస్పెన్స్ అన్నట్లుగా మారింది ఫిరాయింపు ఎమ్మెల్యేల ఎపిసోడ్. ఇప్పటికే స్పీకర్‌కు సుప్రీంకోర్టు పెట్టిన గడువు ముగిసింది. మరో ఎనిమిది వారాలు గడువు ఇవ్వాలంటూ స్పీకర్ ఆఫీస్ పిటిషన్ వేసింది. అది విచారణకు వచ్చేలోపే బీఆర్ఎస్ కోర్టు ధిక్కరణ కింద స్పీకర్‌పై యాక్షన్ కోసం అప్పీల్ చేసింది. ఈ క్రమంలోనే ఫైనల్‌గా స్పీకర్‌కు నాలుగు వారాల గడువు ఇచ్చింది. దీంతో పది మంది ఎమ్మెల్యేల్లో ఎనిమిది మంది విచారణను పూర్తి చేసిన స్పీకర్ గడ్డం ప్రసాద్ తీర్పును రిజర్వ్‌లో పెట్టారు.

ఆ ఇద్దరికి మళ్లీ నోటీసుల వెనుక కొత్త వ్యూహం..!

అఫిడవిట్లు సమర్పించిన ఎనిమిది మంది విచారణ పూర్తి కావడంతో తీర్పు వెలువరిస్తారని..మిగతా ఇద్దరు ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరి రాజీనామా చేస్తారనే ప్రచారం పెద్దఎత్తున జరిగింది. కానీ ఇంతలో ఆల్ ఆఫ్ సడెన్ కొత్త ట్విస్ట్ తెరపైకి వచ్చింది. స్పీకర్ గడ్డం ప్రసాద్..దానం నాగేందర్, కడియం శ్రీహరికి మరోసారి నోటీసులు ఇచ్చారు. గతంలో ఇచ్చిన నోటీసులకే ఈ ఇద్దరు స్పీకర్‌కు రిప్లై ఇవ్వలేదు. అలాంటిది ఇప్పుడు వీళ్లకు మళ్లీ నోటీసులు ఇవ్వడం వెనుక కొత్త వ్యూహం ఉందనే చర్చ పొలిటికల్ సర్కిల్స్‌లో నడుస్తోంది.దానం, కడియం ఇద్దరూ రాజీనామాకు రెడీగానే ఉన్నారట. ఇదే విషయాన్ని ఇద్దరు ఇన్‌సైడ్ డిస్కషన్స్‌లో స్పష్టం చేస్తున్నారు. కానీ ఈ మధ్య జరిగిన జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక తర్వాత వ్యూహం మార్చారట. దానం, కడియం ఇద్దరు రాజీనామా చేస్తే ఒకేసారి రెండు చోట్ల ఉప ఎన్నికలు వస్తే అంత ఈజీగా ఉండదని అంచనా వేస్తున్నారట. మరీ ముఖ్యంగా కడియం శ్రీహరి నియోజకవర్గం స్టేషన్ ఘన్‌పూర్‌లో పరిస్థితి అంత అనుకూలంగా లేదట. దీంతో స్టేషన్ ఘన్‌పూర్‌ను ఉపఎన్నిక నుంచి తప్పించాలనే నిర్ణయానికి వచ్చారట. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కూడా ఇదే అనుమానం వ్యక్తం చేస్తున్నారు. దానం నాగేందర్‌తో రాజీనామా చేయించి..కడియంను కాపాడే ప్రయత్నం జరుగుతోందన్నారు.



ఎట్టి పరిస్థితుల్లో దానం తప్పించుకోలేరా?

దానం కాంగ్రెస్ గుర్తుపై సికింద్రాబాద్ ఎంపీగా పోటీ చేసి దొరికిపోయాడు కాబట్టి..అనర్హత వేటు పడితే..ఇజ్జత్ పోతుందని..రాజీనామా చేయించబోతున్నారని చెప్పారు కేటీఆర్. సాంకేతిక సాకులు చూపి..కడియంను కాపాడే ప్రయత్నం చేస్తున్నారని డౌట్స్ వ్యక్తం చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నుంచి కాంగ్రెస్ తరఫున పోటీ చేసినందున ఎట్టి పరిస్థితుల్లో దానం తప్పించుకోవడానికి వీల్లేదంటున్నారు. అందుకే ఆయన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయడం ఖాయం అంటున్నారు. ఢిల్లీలో ఉన్న దానం నాగేందర్ కాంగ్రెస్ పెద్దలతో మంతనాలు జరుపుతున్నారట. త్వరలోనే ఆయన స్పీకర్‌కు రిసిగ్నేషన్ లెటర్ సబ్‌మిట్ చేయబోతున్నట్లు టాక్.ఫిరాయింపు ఎమ్మెల్యేల ఎపిసోడ్‌లో ఇప్పటికే తమ వివరణ..క్రాస్ ఎగ్జామినేషన్‌లో ఎక్స్‌ప్లనేషన్ ఇచ్చిన ఎనిమిది మంది కూడా తాము పార్టీ మారలేదని స్పష్టం చేస్తున్నారు. తాము సీఎం రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా మాత్రమే కలిశామని..తమ మెడలో వేసింది దేవుడి కండువా అంటూ చెప్పుకొచ్చారు. స్పీకర్‌కు ఇచ్చిన అఫిడవిట్లతో పాటు క్రాస్ ఎగ్జామినేషన్, ఓరల్ ఆర్గ్యుమెంట్‌లో కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేశారు. ఇక లేటెస్ట్‌గా నోటీసులు అందుకున్న కడియం శ్రీహరి కూడా ఇలాంటి వాదనే వినిపించే అవకాశాలున్నట్లు టాక్. ఎనిమిది మంది ఎమ్మెల్యేల మాదిరిగానే కడియం శ్రీహరి కూడా అనర్హత వేటు నుంచి తప్పించుకునే ఆలోచనలో ఉన్నారట. కాంగ్రెస్‌లో చేరలేదని స్పీకర్‌కు రిప్లై ఇవ్వబోతున్నారట.దీంతో పదిమంది ఫిరాయింపు ఎమ్మెల్యేల్లో 9మంది సేఫ్.. దానం నాగేందర్‌పై మాత్రం వేటు పడటమో.? లేక రాజీనామా చేయడమో.? ఏదో ఒకటి పక్కా అని అంటున్నారు. అయితే అటు బీఆర్ఎస్ మా త్రం స్పీకర్ నిర్ణయం తర్వాత మరోసారి సుప్రీంకోర్టు గడప తొక్కేందుకు రెడీ అవుతోంది. ఇలా ఫిరాయింపు ఎమ్మెల్యేల ఎపిసోడ్‌లో ఎవరికి వారు వ్యూహాలకు పదును పెడుతున్నారు. పదవిని కాపాడుకోవడానికి ఎమ్మెల్యేలు చేస్తున్న ప్రయత్నాలు ఫలిస్తాయో.? వేటు వేసే వరకు బీఆర్ఎస్ పోరాటం ఎలా ఉండబోతుందో చూడాలి.

## పాక్ సౌదీలతో ట్రంప్ కార్డు...భారత్ కి డేంజర్ బెల్స్ ?

న్యూఢిల్లీ,వర్తమాన యుగంలో అందరూ అత్యధునిక ఆయుధాలతో సిద్ధంగా ఉంటున్నారు. పూర్వం మాదిరిగా సంప్రదాయ యుద్ధాలు అన్నవి లేవు. టెక్నాలజీయే ప్రపంచాన్ని శాసిస్తోంది. ఈ నేపథ్యంలో ఏ దేశమైనా శతవ్రా మారితే కనుక అది ఇబ్బందికరమే అవుతుంది. ఇక శతవు శతృవు తమకు మిత్రుడు అన్న సూత్రంతో మరే దేశమైనా పావులు కదిపితే అది ముప్పేట చిక్కులు తెచ్చే అవకాశాలే ఉంటున్నాయి. ఇపుడు భారత్ విషయంలో మూడు దేశాలు కలసి కట్టిన చేతులు ఏ దిశను నిర్ణయిస్తాయన్నది చర్చనీయాంశం అవుతోంది.

సౌదీ పాక్ తో పెద్దన్న :

ఒక వైపు పాకిస్తాన్ భారత్ కి ఎప్పటి నుంచో దాయాది దేశం అని ప్రత్యేకంగా చెప్పాల్సిన పని అయితే లేదు. ఆపరేషన్ సింధూర్ తో పాక్ భారత్ దెబ్బను రుచి చూసిన తరువాత గుణపాఠం నేర్చుకోకపోగా మరింతగా రెచ్చిపోతోంది. ఈ నేపథ్యంలో సౌదీ అరేబియాతో కొత్త స్నేహం మొదలెట్టింది. ఈ సెప్టెంబర్ లో సౌదీ అరేబియా పాక్ కీలక ఒప్పందాలను చేసుకున్నాయి. ఇపుడు చూస్తే అమెరికా పెద్దన్న కూడా ఈ ఇద్దరితో సై అంటున్నారు. తమకు నాటో దేశాల తరువాత అతి ముఖ్యమైన మిత్ర దేశం సౌదీయే అని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేయడంతో భారత్ ఈ విషయంలో సీరియస్ గా ఆలోచించాల్సిన పని పడింది అని అంటున్నారు.

అమెరికా భారత్ ల మధ్య :

ఇక చూస్తే కనుక అమెరికా భారత్ ల మధ్యన సంబంధాలు ఇటీవల కాలంలో అంత బాగా లేవు. వరసబెట్టి వాణిజ్య సుంకాలను అధికంగా పెంచడం ద్వారా అమెరికా పెద్దన్న భారత్ ని టార్గెట్ చేస్తూ వస్తున్నాడు. మరో వైపు రష్యా నుంచి చమురు కొనుగోలు చేయడం కూడా అమెరికాకు కన్నెర్రగా మారింది. ఇక భారత్ అయితే అందరితో స్నేహం చేస్తూనే తన అస్తిత్వం కాపాడుకునేందుకే అధిక ప్రాధాన్యత ఇస్తుంది అన్నది తెలిసిందే. ఈ నేపథ్యంలో శ్వేత సౌధం భారత్ మీద ఎందుకో తెలియని కోపంతో గ్యాప్ ని పెంచుకుంటోంది అని అంటున్నారు.

సౌదీ పాక్ ల చెలిమి :

ఇక సౌదీ అరేబియా పాకిస్థాల మధ్య కొత్తగా బలంగా పెరుగుతున్న అనుబంధం కూడా భారత్ ని ఆలోచించుకునే లాగానే చేస్తోంది అని అంటున్నారు. అదే సమయంలో సౌదీతో కూడా భారత్ కి మంచి సంబంధాలు ఉన్నాయి. ఈ ఏడాది ఏప్రిల్ లో సౌదీ పర్యటన చేపట్టిన ప్రధాని నరేంద్ర మోడీ ఆ దేశంతో అనేక రంగాలలో కీలక ఒప్పందాలు కుదుర్చుకున్నారు. టెక్నాలజీ ఇంధనం తదితర రంగాలలో భారీ పెట్టుబడులు పెట్టేందుకు కూడా సౌదీ అంగీకరించింది.



ఇలాంటి సౌదీ సెప్టెంబర్ నాటికి పాక్ వైపు కొంత మొగ్గినట్లుగా సీన్ అయితే కనిపిస్తోంది. ఇక సౌదీ అరేబియాను పశ్చిమ దేశాలు మరీ ముఖ్యంగా అమెరికా చాలా కాలం పాటు దూరంగా ఉంచింది. గత అధ్యక్షుడు జో బైడెన్ అయితే సౌదీకి పూర్తిగా ఎడం పాటించారు. అయితే ట్రంప్ ఉన్నట్టుండి సౌదీ మిత్ర దేశం అంటూ వేసిన ట్రంప్ కార్డు తో ఇపుడు దక్షిణాసియా దేశాల మధ్య కొత్త రకం సమీకరణలు మారే అవకాశాలు కనిపిస్తున్నాయని అంటున్నారు.

వైట్ హౌస్ లో సౌదీ యువ రాజు :

అంతే కాదు ట్రంప్ తన వైట్ హౌస్ కి సౌదీ యువరాజు మహమ్మద్ బీన్ సల్మాన్ ని ఆహ్వానించి మరీ ద్వైపాక్షిక చర్చలు జరపడం కూడా విశేష పరిణామంగా చెప్పుకుంటున్నారు. ఇంకో వైపు చూస్తే సౌదీ యువ రాజు ట్రంప్ ల మధ్య బలపడుతున్న ఈ బంధం సంగతి అంతా ఆశ్చర్యంగానే ఉంది అని అంటున్నారు. ఇరు దేశాల మధ్య రక్షణ భద్రత, వాణిజ్య రంగాలలో బంధం కొనసాగుతుందని ట్రంప్ ప్రకటించడమూ కీలకమైన పరిణామమే. అంతే కాదు ఎం 25 ఫైటర్ జెట్స్ ని విక్రయించేందుకు ట్రంప్ అంగీకరిస్తే అమెరికాలో పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టేందుకు సౌదీ ముందుకు వచ్చింది. సౌదీని అత్యంత మిత్ర దేశంగా సౌదీని పరిగణించడం ద్వారా అమెరికా అనేక రంగాలలో ఆ దేశానికి దోహదపడుతుంది. అలా తనకు అత్యంత సన్నిహితమైన దేశాల జాబితాలో సౌదీని ట్రంప్ చేర్చగలిగారు.

పాక్ సౌదీలతో :

సౌదీ పాక్ ల మధ్య ఉమ్మడి రక్షణ ఒప్పందం ఇప్పటికే ఉంది. ఒక దేశం మీద దాడి జరిగితే రెండవ దేశం మీద కూడా దాడి జరిగినట్లుగా భావిస్తూ రెండు దేశాలు ఒకేసారి ప్రత్యర్ధి మీద యుద్ధానికి దిగుతాయి అన్న మాట. పాకిస్థాన్ ఈ ఒప్పందం ఆసరాతో భారత్ ని టార్గెట్ చేసుకుంటారని అంటున్నారు.

## హిందువులు లేకుండా ప్రపంచం ఉనికే లేదు




న్యూఢిల్లీ,రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ చీఫ్ మోహన్ భగవత్ కీలక వ్యాఖ్యలు చేశారు. హిందువులు లేకుండా ప్రపంచం ఉనికే లేదని వ్యాఖ్యానించారు.

ప్రపంచ మనుగడకు హిందూ సమాజం కీలకమని అన్నారు. ప్రస్తుతం ఈశాన్య రాష్ట్రం మణిపూర్‌లో పర్యటిస్తున్న ఆయన.. అక్కడ ఏర్పాటు చేసిన ఓ బహిరంగ సభలో ప్రసంగించారు.'ప్రపంచంలోని ప్రతీ దేశం అన్ని రకాల పరిస్థితులను చూసింది. యునాన్ (గ్రీస్), మిస్ర్ (ఈజిప్ట్), రోమ్ వంటి గొప్ప నాగరికతలు నశించిపోయాయి. కానీ మన నాగరికత మాత్రం ఇప్పటికీ నిలిచే ఉంది. మన నాగరికతలో ఏదో ప్రత్యేకత ఉంది, అందుకే మనం ఇంకా ఇక్కడ ఉన్నాం. భారత్ అనేది అంతంలేని నాగరికతకు పేరు. మన సమాజంలో మనం ఓ బలమైన వ్యవస్థను నిర్మించుకున్నాం. దాని కారణంగానే హిందూ సమాజం ఎప్పటికీ ఉంటుంది. హిందువులు ఉనికి కోల్పోతే.. ప్రపంచానికే ఉనికి ఉండదు. ప్రపంచ మనుగడకు హిందూ సమాజం కీలకం' అని ఆయన వ్యాఖ్యానించారు. ఆయన వ్యాఖ్యలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి.

## ఆపరేషన్ సింధూర్ వేళ.. హెచ్‌క్యూ-9 ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్‌ను పరీక్షించిన చైనా



న్యూఢిల్లీ: ఆపరేషన్ సింధూర్ సమయంలో చైనా అవకాశవాదానికి పాల్పడినట్లు తెలుస్తోంది. ఆ సంక్షోభ సమయంలో డ్రాగన్ దేశం తన అత్యాధునిక ఆయుధాలను పరీక్షించినట్లు అమెరికా తాజా రిపోర్టులో పేర్కొన్నది. ఇండో-పాక్ సమరాన్ని.. చైనా తన ఆయుధ పరీక్షకు వాడుకున్నట్లు యూఎస్-చైనా ఎకనామిక్ అండ్ సెక్యూర్టీ రివ్యూ కమీషన్ వెల్లడించింది. మంగళవారం ఆ కమిటీకి చెందిన నివేదికను రిలీజ్ చేశారు. పెహల్గామ్ ఉగ్రదాడి తర్వాత పాకిస్థాన్‌లోని ఉగ్రస్థావరాలను ఇండియా ధ్వంసం చేసిన విషయం తెలిసిందే. అయితే ఆపరేషన్ సింధూర్ సమయంలో చైనా అక్రమ రీతిలో తన ఆయుధాలను పరీక్షించినట్లు ఆ రిపోర్టులో పేర్కొన్నారు.ఇండోపాక్ సమరం వేళ చైనా తన ఆయుధ సంపత్తిలో ఉన్న హెచ్‌క్యూ-9 ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్, పీఎల్-15 ఎయిర్ టు ఎయిర్ మిస్సైల్స్, జే-10 ఫైటర్ విమానాలను పరీక్షించినట్లు అమెరికా తన రిపోర్టులో చెప్పింది. నాలుగు రోజుల ఆ యుద్ధంలో చైనా తన ఆయుధాలను వాస్తవిక ప్రపంచంలో పరీక్షించినట్లు రిపోర్టులో పేర్కొన్నారు. పాకిస్థాన్‌కు అండగా నిలుస్తున్న చైనా.. తన ఆయుధాలను ఆ దేశానికి అమ్మేందుకు ప్లాన్ చేస్తున్నది. జే-35 ఫిఫ్త్ జనరేషన్ యుద్ధ విమానాలను సుమారు 40 వరకు అమ్మేందుకు పాకిస్థాన్‌తో ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలుస్తోంది. జే-35 ఫైటర్ జెట్స్‌తో పాటు కేజే-500 విమానాలు, బాలిస్టిక్ క్షిపణి వ్యవస్థను కూడా పాక్‌కు అమ్మేందుకు డ్రాగన్ దేశం జూన్‌లోనే డీల్ చేసుకున్నట్లు ఆ రిపోర్టులో తెలిపారు.ఇండియా, పాక్ సంక్షోభ సమయంలో వాడిన ఆయుధాలు సక్సెస్ అయినట్లు చైనా ఎంబసీలు ప్రశంసలు కురిపించాయి. వెపన్ సేల్స్ పెంచేందుకు ఈ ప్రక్రియ చేపట్టినట్లు రిపోర్టులో చెప్పారు. పలు దఫాల చర్చలు, పరిశోధనల అనంతరం కమిటీ ఈ విషయాన్ని ద్రువీకరించింది. ఇండోపాక్ వార్‌ను పరోక్ష యుద్ధంగా చైనా వాడుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆ యుద్ధంలో ఆయుధాలను వాడిన చైనా.. రెచ్చగొట్టే రీతిలో ప్రవర్తించినట్లు అమెరికా కమిటీ తన నివేదికలో పేర్కొన్నది.ఫ్రెంచ్ తయారీకి చెందిన రఫేల్ యుద్ధ విమానాల గురించి చైనా తప్పుడు ప్రచారం చేసినట్లు అమెరికా తన రిపోర్టులో స్పష్టం చేసింది. రఫేల్ యుద్ధ విమానాల అమ్మకాలను తగ్గించేందుకు చైనా తమపై తప్పుడు ప్రచారం చేసిందని ఫ్రెంచ్ ఇంటెలిజెన్స్ పేర్కొన్నట్లు రిపోర్టులో తెలిపారు. ఫేక్ సోషల్ మీడియా అకౌంట్ల ద్వారా ఏఐ, వీడియో గేమ్ ఇమేజ్‌లను వైరల్ చేశారు. చైనాకు చెందిన ఆయుధాలు రఫేల్‌ను కూల్చివేసినట్లు ప్రచారం నిర్వహించారు. జే-35 యుద్ధ విమానాలను అమ్ముకునేందుకు చైనా ఈ ప్రయత్నం చేసినట్లు కమిటీ తన రిపోర్టులో వెల్లడించింది.రఫేల్ యుద్ధ విమానాలను కొనుగోలు చేయాలనుకున్న ఇండోనేషియాను చైనా ఎంబసీ అధికారులు అడ్డుకున్నట్లు కూడా రిపోర్టులో పేర్కొన్నారు. కానీ అమెరికా ఇచ్చిన రిపోర్టును చైనా కొట్టిపారేసింది. ఆ నివేదికలో వాస్తవం లేనట్లు డ్రాగన్ దేశం పేర్కొన్నది. అమెరికా రిపోర్టులో తప్పులు ఉన్నట్లు చైనా విదేశాంగ ప్రతినిధి మావో నింగ్ తెలిపారు.ఏప్రిల్ 22వ తేదీన పెహల్గామ్‌లో ఉగ్రవాదులు 26 మంది టూరిస్టులను చంపేశారు. ఈ నేపథ్యంలో మే 7వ తేదీన భారత బలగాలు ఆపరేషన్ సింధూర్ చేపట్టాయి. పాక్‌తో పాటు పీవోకేలో ఉన్న ఉగ్రస్థావరాలను ధ్వంసం చేసింది ఇండియా. ఆ సమయంలో పాక్ మిస్సైల్, డ్రోన్ దాడికి దిగింది. కానీ వాటిని భారత్ తిప్పికొట్టింది. పాక్‌లో ఉన్న ఎయిర్‌ఫీల్డ్స్‌ను ఇండియా టార్గెట్ చేసింది. మే 10వ తేదీన భారత్, పాక్ మధ్య కాల్పుల విరమణ జరిగిన విషయం తెలిసిందే.

## స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్లపై జీవో విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం

హైదరాబాద్, స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి రిజర్వేషన్ల విధివిధానాలను రాష్ట్ర ప్రభుత్వం ఖరారు చేసింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు 50 శాతం మించకుండా రిజర్వేషన్లు కల్పించేలా మార్గదర్శకాలను జారీ చేసింది. ఈ మేరకు శనివారం జీవోను విడుదల చేసింది. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో రిజర్వేషన్లను ఎలా అమలులోకి తీసుకురావాలో స్పష్టమైన ప్రక్రియను వివరించింది.భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 244 ప్రకారం షెడ్యూల్డ్ ఏరియాల్లో రిజర్వేషన్లను అమలు చేయనున్నట్లు జీవోలో పేర్కొంది. ఇక మహిళలకు 50 శాతం వరకు రిజర్వేషన్లకు కల్పించాలని నిర్ణయించింది. ఈ రిజర్వేషన్లను ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ సహా అన్ని కేటగిరీల్లో సమానంగా అమలు చేయాలని మార్గదర్శకాల్లో పేర్కొంది. గత (2019) ఎన్నికల్లో ఏ కేటగిరీకి రిజర్వేషన్లు కేటాయించారో , వాటిని పరిగణనలోకి తీసుకుని తాజా రొటేషన్ ప్రకారం రిజర్వేషన్లు అమలు చేయాలని స్పష్టం చేసింది. ఇక వార్డు మెంబర్లకు 2024 కుల సర్వే ఆధారంగా,




సర్పంచులకు 2011 సెన్సస్ ఆధారంగా( బీసీ సర్పంచ్ అభ్యర్థులకు 2024 కుల సర్వే) రిజర్వేషన్లు కల్పించింది.

## మరోసారి శంషాబాద్ ఎయిర్ పోర్టుకు బాంబు బెదిరింపు




హైదరాబాద్,శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు మరోసారి బాంబు బెదిరింపులు వచ్చాయి. అరైవల్ ప్రాంతంలో ఆర్‌డీఎక్స్ బాంబు ఉంచినట్లు ఆగంతకులు బెదిరింపులకు పాల్పడ్డారు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం బెదిరింపు మెయిల్ పంపారు. అప్రమత్తమైన పోలీసులు భద్రతా చర్యలు చేపట్టారు. సందర్శకుల పాసుల కౌంటర్ మూసివేశారు. ఎయిర్‌పోర్ట్ లో తనిఖీలు చేపట్టారు. బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌తో క్షుణ్ణంగా తనిఖీ చేశారు.

బూటకపు బెదిరింపు

అయితే, ఈ తనిఖీల్లో ఎలాంటి పేలుడు పదార్థాలూ, అనుమానాస్పద వస్తువులూ లభించలేదు. దీంతో అది బూటకపు బెదిరింపుగా తేల్చినట్లు పోలీసులు వెల్లడించారు. కాగా, రెండు రోజుల క్రితం కూడా శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ కు ఇలాంటి బెదిరింపులే వచ్చిన విషయం తెలిసిందే.


## సంపాదకీయం

ఆదివారం 23-11-2025

# నక్సల్స్ ఏరివేతే కాదు... గిరిజనుల అభివృద్ధి ముఖ్యం !

కార్పొరేట్ల కన్ను అటవీ ప్రాంతాలపైన, కొండల కింద ఉన్న గనుల పైన పడటంతో గిరిజనులను అక్కడి నుండి వెళ్లగొట్టడానికి వివిధ పేర్లతో కుట్రలు జరుగుతున్నాయన్నది లెఫ్ట్ పార్టీల వాదనగా ఉంది. ఇది ఎంత వరకు నిజమనో తెలియాలి. ఇదే నిజమైతే దీనికి ప్రజాస్వామ్య పద్ధతిలో లెఫ్ట్ నేతలు కూడా పోరాటం చేపట్టాలి. ప్రజలను సమీకరించాలి. అడవులను నాశనం చేసేవారు ఎంతటి వారైనా నిలదీయాల్సిందే. అటవీ హక్కులను తిరస్కరిస్తున్నట్లుగా గుర్తిస్తే అందుకు ప్రజా ఉద్యమాలను నిర్మించాలి. గిరిజనులతో నామమాత్రంగా కూడా చర్చించకుండానే పలు ప్రాజెక్టులను వారి నివాస ప్రాంతాల్లో చేపడుతున్నట్లుగా ఆరోపణలు చేస్తున్నారు. చట్ట ప్రకారం తప్పనిసరైన గ్రామసభలను సైతం దాటవేస్తున్నారు. ఈ తరహా సర్కారీ దమనకాండపై అసంతృప్తిని, నిరసనను వ్యక్తం చేయడానికి కూడా అవకాశం ఇవ్వకుండా ఉక్కుపాదం మోపుతున్నారని అంటున్నారు. లెఫ్ట్ పార్టీలకు ఉద్యమాలు, పోరాటాలు కొత్త కాదు. ఇవే నిజమైతే ప్రజా ఉద్యమాలను నిర్మించాలి. కేంద్ర ప్రభుత్వం ప్రకటించినట్లుగానే తీవ్ర నిర్బంధ చర్యల ద్వారా మావోయిస్టులను పై చేయి సాధించవచ్చు. కానీ, అణచివేతకు గురవుతున్న ప్రజానీకపు జీవన పరిస్థితుల్లో మార్పు రాకుంటే వారిలోని అసంతృప్తి మరోరూపం తీసుకోవచ్చు. ఇది ఒక సామాజిక ఆర్థిక సమస్య. క్షేత్రస్థాయిలో అసమానతలను రూపుమాపడమే దీనికి పరిష్కారం కావాలి. అలాగే గిరిజనులను పాలనలో భాగస్వాములను చేయాలి. వారి నివాస ప్రాంతాల్లో అభివృద్ధికి సంబంధించిన అంశాల్లో నిర్ణయాధికారం వారిదే కావాలి. విద్య, వైద్య సౌకర్యాలతో పాటు, ఉపాధిని పెద్ద ఎత్తున కల్పించాలి. దీంతో అడవుల్లో అన్నల అవసరం రాకపోవచ్చు. మావోయిస్టుల పేరుతోనో, వారి సానుభూతిపరుల పేరుతోనో గిరిజనులను పోలీసుల వేధింపులను, నిర్బంధాన్ని తక్షణం నిలిపివేయాలి. ఇకపోతే నక్సల్స్ ఏరివేత వెనక ఇదే పరమార్థం అని అంటున్నారు. నక్సల్స్ ఏరివేతతో అటవీ సంపద వినాశనాన్ని ముడిపెట్టరాదు. ఇవి రెండు కూడా వేర్వేరు అంశాలు. అందువల్ల మావోయిస్టుల ఏరివేతను అడవుల సంరక్షణతో పోల్చరాదు. అడవులను కార్పొరేట్లకు కట్టిపెడుతున్నారని ఖచ్చితమైన సమాచారం ఉంటే ఎవ్వరైనా పోరాడవచ్చు. ఇకపోతే లొంగిపోవడానికి వచ్చిన నక్సల్స్ నేత హిడ్మాను, ఆన భార్య, ఇతర అనుచరులను మట్టుపెట్టారని, క్రెడిట్ దక్కించుకోవడానికే పోలీసులు ఈ పనిచేశారని వస్తున్న వార్తలపై పోలీసులే నిజాలు వెల్లడిస్తారని అనుకుంటే పొరపాటే. ఎందుకంటే ఖాకీ దుస్తులు వేసుకున్న తరవాత వారికి మానవత్వం అన్నది ఉండదు. నక్సలైట్ ఉద్యమంలో ఎందరో పోలీసులు అసువులు బాసారు. ఎందరో క్రూరంగా హత్యకు గురయ్యారు. మందుపాతరలకు బలయ్యారు. ఇవన్నీ వారు తప్పకుండా పగగానే తీసుకుంటారు. దీనికితోడు ప్రభుత్వం వారికి టార్గెట్లు విధించింది. అందువల్ల చిక్కిన అవకాశాన్ని వదులుకోరు. అందులోనూ నక్సల్స్ విషయంలో అస్సలు ఉండదు. మనం ఇక్కడ రెండు వైపుల ఆలోచన చేయాలి. నక్సల్స్ కూడా తమ ఉద్యమంలో కిరాతకంగా వ్యవహరించారు. చంపడంలో ఆరితేరారు. ఖతం చేయడమే వారి ఉద్యమంగా సాగింది. ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేశారు. మొత్తంగా నక్సల్స్ ఉద్యమంలో రెండువైపులా ప్రాణనష్టం జరిగింది. అమాయకులను ఎందరినో వారు పొట్టన పెట్టుకున్నారు. నేతలను బలితీసుకున్నారు. దీంతో వారు సాధించిందేమీ లేకపోగా, ఉద్యమం వల్ల దేశానికి తీవ్ర నష్టమే జరిగింది. అందుకే హిడ్మా లొంగిపోవడానికి వచ్చినా పట్టుకుని కాల్చేశారని అంటున్నారు. పోలీసులు అవకాశం కోసం చూస్తారు. అదను చూసి దెబ్బ తీస్తారు. ఇదంతా ఎలా ఉన్నా ఇరువైపులా హింస సరికాదు. నక్సల్స్ కూడా ప్రజల పక్షాన పోరాడడం మాని కేవలం అడవుల్లోనే ఉంటూ హింసాత్మక ఘటనలతో భీతావాహ పరిస్థితులను సృష్టించారు. నిజంగానే ఇప్పటికైనా నక్సల్స్ ఉంటే వారంతా జనజీవన ప్రవంతిలోకి రావాలి. ప్రజల పక్షాన సమస్యలపై పోరాడాలి. ఇకపోతే అసలు ఆపరేషన్ కగార్ చేపట్టిందే హిడ్మా కోసమని, ఆయన కోసం డెడ్‌లైన్ కూడా పెట్టారని, ఆ గడువులోపలే పనిపూర్తయిందని మీడియాలో వస్తున్న కథనాలను చూస్తూనే ఉన్నాం. కేంద్రహోంశాఖ మంత్రి అమిత్ షా కూడా పదేపదే మార్చి అంటూ టార్గెట్ పెడుతూనే ఉన్నారు. అందుకే తాజా రెండు ఎన్‌కౌంటర్లతో ఏం జరిగిందో అర్థం చేసుకోవచ్చు. భయోత్పాతం సృష్టించడమే లక్ష్యంగా జరిగే పోలీసు కనుసన్నల్లో జరిగే ఈ తరహా సంఘటనలు ఎంతమాత్రం సమర్థనీయం కాదని కొందరు అంటున్నారు. నక్స్లకు మద్దతుగా నిలిచిన వారికి ఇది మారణహోమంగానే ఉంటుంది. అదే సందర్భంలో రాజకీయ నేతలను, పోలీసులను నక్సల్స్ అత్యంత కిరాతకంగా హత్య చేసిన పలు సందర్భాల్లో ఇప్పుడు విమర్శలు చేస్తున్నవారు ఏనాడూ స్పందించలేదు. నక్సల్స్‌కు భయపడి వీరంతా మిన్నకున్నారు. నిజానికి ఇటువంటి అప్రజాస్వామిక, హింసాత్మక విధానాలను ఎవరు అవలంబించినా ఖండించాల్సిందే. ఇకపోతే మరో నక్సల్ నాయకుడు తిప్పిరి తిరుపతి పోలీసుల అదుపులో ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. అదే నిజమైతే పోలీసులు అదుపులోకి తీసుకున్న వారందరినీ తక్షణం న్యాయస్థానాల ముందు హాజరుపర్చాలి. ఇకపోతే రెండు రోజులుగా రాష్ట్రంలో చోటుచేసుకుంటున్న పరిణామాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఇటీవల కాలంలో ఎన్నడూ లేని విధంగా వరుసగా జరుగుతున్న మావోయిస్టుల ఎన్‌కౌంటర్లు, అరెస్టులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ఒక కుదుపు కుదిపాయి. ఎందుకంటే ఇటీవలి కాలంలో ఎపిలో నక్సల్స్‌ఉన్న జాడలేదు. అందుకే ఈ ఎన్‌కౌంటర్లపై సహజంగానే అనుమానాలు రవాడం సహజం. అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి అటవీప్రాంతంలో మంగళవారం ఉదయం జరిగిన పోలీసు కాల్పుల్లో మావోయిస్టు పార్టీ అగ్రనేత హిడ్మా, ఆయన భార్య రాజక్కతో సహా ఆరుగురు మరణించారు. ఈ సంఘటన రేపిన కలకలం చల్లారకముందే, 24 గంటలలోపే బుధవారం ఉదయం దాదాపు అదే ప్రాంతంలో జరిగిన మరో ఘటనలో ఏడుగురు మావో యిస్టులు ప్రాణాలు నేలకొరిగారు. ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్ర ప్రభుత్వమే మావోయిస్టుల నిర్మూలన కార్యక్రమాన్ని అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఆయుధాలతో సహా బేషరతుగా లొంగిపోవడం తప్ప మరో మార్గంలేదని సాక్షాత్తు కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా పదేపదే ప్రకటించారు. ఆ హెచ్చరికల నేపథ్యంలోనే ఇవన్నీ సాగుతున్నాయని భావించాల్సిందే. ఆపరేషన్ కగార్ చేపట్టినతరువాత అంతా అయిపోయిందనుకుంటే పొరపాటు. అక్కడ నివసిస్తున్న గిరిజనుల సమస్యలు పరిష్కరించకుండా ముందుకు సాగితే పరిస్థితుల్లో మార్పు రాదని ప్రభుత్వాలు గుర్తించాలి.

# వచ్చే ఎన్నికల్లో బీహార్ గాలి వీస్తుందా?



పాట్నా:బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో దిగ్విజయంతో బిజెపి ఆనందానికి అవధుల్లేవు. ఈ విజయవీర గర్వంతో తమిళనాడు, పశ్చిమబెంగాల్ రాష్ట్రాల్లో వచ్చే ఏడాది జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీహార్ ప్రభంజనం వీస్తుందని ఇప్పటి నుంచే కలలు కంటోంది. బీహార్‌లో కులాల బలం ఒక కథగా మిగిలిపోయి, చివరకు మహిళా ఓటర్లే కీలకమయ్యారు. ఈ అనుభవంతో ప్రధాని మోడీ రైతు వర్గాలను ఆకర్షించడానికి బుధవారం (19.11.25 ) దేశంలోనే అత్యంత నగరీకరణ కలిగిన తమిళనాడు లోని రైతులను పాన్ ఇండియాకు చేరువ చేశారు. వాస్తవానికి తమిళనాడు ఆదాయంలో వ్యవసాయం నుంచి వచ్చేది కేవలం 13 శాతం మాత్రమే. అయినా సరే తమిళనాడు లోని కోయంబత్తూరులో బుధవారం జరిగిన సభలో హాజరైన ప్రజానీకం తమ తువ్వాళ్లను గాలిలో ఎగురవేస్తూ మోడీకి స్వాగతం పలకడంపై పులకించిపోయి తాను రాకముందే ఇక్కడ బీహార్ గాలి వీచినట్టు కనిపిస్తోందని వాక్చాతుర్యం ప్రదర్శించారు.కోయంబత్తూరునుంచే దేశంలోని రైతులకు పిఎం కిసాన్ సమ్మాన్ నిధి నుంచి 21వ విడత ఆర్థికసాయంగా రూ. 18 వేల కోట్లను విడుదల చేయడం గమనార్హం. కోయంబత్తూరు అసెంబ్లీ స్థానం బిజెపిదే. గత ఏడాది అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి అభ్యర్థి తన ప్రత్యర్థి కమల్‌హాసన్‌ను చాలా స్వల్ప మెజార్టీతో ఓడించారు. 234 అసెంబ్లీ స్థానాలు కలిగిన తమిళనాడు నుంచి 2.6 శాతం ఓట్లతో నలుగురు బిజెపి ఎంఎల్ఎలు గెలిచారు. 2001లో కూడా కరుణానిధి నేతృత్వంలో డిఎంకెతో పొత్తు కుదుర్చుకుని బిజెపి నాలుగు స్థానాలనే దక్కించుకోగలిగింది. కానీ 2006లో పోటీ చేసిన మొత్తం 225 మంది బిజెపి అభ్యర్థుల్లో 221 మంది డిపాజిట్లు కూడా దక్కించుకోలేక కుప్పకూలింది. 2001 నుంచి బిజెపి ఓట్ల వాటా 2 శాతం నుంచి 3 శాతం మించి కొనసాగడం లేదు. గత ఐదు ఎన్నికల నుంచి బిజెపి, డిఎంకె రాజకీయంగా, సిద్ధాంతపరంగా, ఉత్తరదక్షిణ ధ్రువాలుగా ఉంటూ తీవ్రంగా పోటీ పడుతున్నాయి.తమిళనాడులో వ్యవసాయానికి చేనేత రంగం ఊతంగా నిలిచింది. మిగతా రాష్ట్రాల మాదిరిగానే వాతావరణ మార్పులు వ్యవసాయ, చేనేత రంగాలను ఘోరంగా దెబ్బతీశాయి. ప్రధాని మోడీ తమిళనాడు పర్యటనకు ముందు వ్యవసాయ రంగాన్ని కేంద్రం ఆదుకోవాలని ముఖ్యమంత్రి స్టాలిన్ అభ్యర్థించారు. బాగా పండిన వరి ప్రొక్యూర్‌మెంట్ ఎక్కువ చేయాలని, తేమ శాతం మినహాయింపు పరిధిని పెంచాలని, ధాన్యం మిల్లింగ్‌కు భారీగా అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. మామిడి గుజ్జుపై జిఎస్‌టి భారం 12 శాతం నుంచి 5 శాతానికి తగ్గించాలని కోరారు. ఈ సమస్యలు రానున్న ఎన్నికల్లో ఎంతవరకు ప్రభావితం చేస్తాయో చెప్పలేం. కుల ప్రభావం ఎలా ఉన్నా సనాతన ధర్మంపై బిజెపికి, డిఎంకెకు మధ్య గట్టి పోరు ఉంటుంది. ఇదిలా ఉండగా కోయంబత్తూరు, మధురలకు మెట్రోరైలు ప్రాజెక్టులను మంజూరు చేయాలని కొన్నేళ్లుగా తమిళనాడు ప్రభుత్వం కోరుతున్నా కేంద్ర ప్రభుత్వం తిరస్కరించడం కూడా రాష్ట్రానికి, కేంద్రానికి మధ్య సంఘర్షణకు దారి తీస్తోంది.తమిళనాడుతోపాటు పశ్చిమబెంగాల్‌లో కూడా ఆరునెలల వ్యవధిలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ప్రస్తుత తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వానికి, బిజెపికి మధ్య కులాలు, మత విశ్వాసాలు ఢీకొనే పరిస్థితి కనిపిస్తోంది. ఓట్ల బ్యాంకు కోసం కొత్త లక్ష్యాలు పుట్టుకొస్తున్నాయి. ముప్పైయేళ్ల వామపక్ష పార్టీకి, టీఎంసికి కార్యకర్తల మధ్య ఘర్షణలు కొనసాగుతున్నాయి. మమతాబెనర్జీ ప్రభుత్వంలో అనేక పొరపాట్లు చోటుచేసుకోవడంతో ఆ పార్టీ కార్యకర్తలు కుంగిపోతున్నారు. ఉపకులాలు, గూర్ఖాలకు ప్రత్యేక గుర్తింపు, మతం, భాష తదితర అంశాల్లో విభేదాలు తలెత్తుతున్నాయి. దీనికి తోడు ముస్లిం బెంగాలీలు అంతా చొరబాటుదారులే అన్న కొత్త వివాదం తెరపైకి వచ్చింది. ఇవన్నీ ఎలా ఉన్నా బెంగాల్‌లో బిజెపి అత్యద్భుతంగా పురోగమిస్తోంది. 2016లో 10% ఓట్లతో మూడు సీట్లను తెచ్చుకున్న బిజెపి, 2021 నాటికి 30 శాతం ఓట్లతో 77 సీట్లను సాధించగలిగింది. బెంగాల్‌లో అనేక కారణాల వల్ల శాంతిభద్రతలు సమస్యలను సృష్టిస్తున్నాయి. వైద్య విద్యార్థులపై అత్యాచారాలు, కొన్ని వర్గాల గూండాయిజం స్థానిక ప్రజలను వేధిస్తోంది.ఇవన్నీ ప్రస్తుత ప్రభుత్వంపై అసంతృప్తిని పెంచుతున్నాయి. దీన్ని నివారించడానికి ముఖ్యమంత్రి మమతాబెనర్జీ సర్వవిధాలా ప్రయత్నిస్తున్నారు. అయినా సరే ఘర్షణలతో వ్యవస్థీకృత నేరాలుగా మారిన రాజకీయ హింస, వీటన్నిటితో అస్థిరత నెలకొన్న బెంగాల్‌ను తమకు అనుకూలంగా మలచుకుని లాభపడాలని బిజెపి చూస్తోంది. పార్టీ కార్యకర్తల స్వైరవిహారంతో కొన్ని ఘర్షణలు తలెత్తుతుండడంతో కేంద్రం, రాష్ట్రం పరస్పర ఆరోపణలు చేసుకోవడం పరిపాటిగా మారింది. క్షేత్రస్థాయిలో వీటిని నివారించడం, ప్రజలకు భద్రత కల్పించే బాధ్యత తీసుకోవడం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కర్తవ్యమే అయినా సరిగ్గా నెరవేరడం లేదు. తమిళనాడు, పశ్చిమబెంగాల్ రాష్ట్రాలు రెండూ కేంద్ర బిజెపిని వ్యతిరేకించేవే. ఈ రెండు రాష్ట్రాల మధ్య కొన్ని సారూప్యాలు కనిపిస్తున్నాయి. ఆర్థికంగా, పారిశ్రామికంగా తమిళనాడు స్థిరపడిన రాష్ట్రం. దాంతో పోలిస్తే పశ్చిమబెంగాల్‌లో పేదరికం ఎక్కువ. పైగా వ్యవసాయ ఆధారిత రాష్ట్రం. ఈ రెండు రాష్ట్రాల ప్రస్తుత ప్రభుత్వాలు కొత్త ఓటర్ల జాబితాల సవరణను వ్యతిరేకిస్తున్నాయి. అలాగే భాషావాదం, మహిళా సంక్షేమంలో ఒకే భావాలు కలిగి ఉంటున్నాయి. తమిళనాడులో మహిళల అక్షరాస్యత 73 శాతం ఉండగా, పశ్చిమబెంగాల్‌లో 71% వరకు ఉంది. ఈ నేపథ్యంలో ఎన్నికల నిర్వహణ యంత్రాంగం భయంకర వ్యవస్థగా తయారవ్వడం బిజెపికి ఒక సవాలుగా మారింది. రెండు రాష్ట్రాల్లో ఎక్కడ ఏ లోపాలు ఉన్నాయో ఎత్తిచూపడానికి కమలనాథలు అన్వేషించే పనిలో పడ్డారు.

# లొట్టపీసు కేసులో కేటీఆర్‌కు జైలు తప్పదా?



హైదరాబాద్, 'లొట్టపీసు కేసు..', 'లొట్టపీసు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి', 'ఫార్ములా ఈ-రేసు కేసుకు భయపడేది లేదు', 'జైలుకు వెళ్లడానికి కూడా సిద్ధమే' అంటూ మాజీ మునిసిపల్ శాఖ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారక రామారావు పలుమార్లు మీడియా ముందు శివాలెత్తారు. అదే లొట్టపీసు కేసు కేటీఆర్ మెడకు చుట్టుకుని ముప్పు తిప్పలు పెట్టే అవకాశాలు ఉన్నాయని, ఇక తప్పించుకోలేరని న్యాయ నిపుణులు వ్యాఖ్యానిస్తున్నారు. కేటీఆర్‌ను ప్రాసిక్యూట్ చేసేందుకు రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పచ్చజెండా ఊపడంతో కేటీఆర్ చుట్టూ ఉచ్చు బిగుసుకున్నట్టేనని అంటున్నారు. విచారణలో ఆలస్యమైనా అంతా చట్టబద్ధంగా జరుగుతోందని, తప్పించుకోవడం అసాధ్యమనే వాదనలు రాజకీయ వర్గాల్లో జరుగుతున్నాయి. గవర్నర్ అనుమతించడంతో చార్జ్‌షీట్ దాఖలు చేసి, విచారణ పేరుతో పిలిచి అరెస్టు చేయడమే తరువాయి అంటున్నారు. మొన్నటి వరకు ఈ ఫార్ములా కేసు లొట్టపీసు కేసు%"%రేవంత్ రెడ్డి లొట్టపీసు ముఖ్యమంత్రి, అర పైసా కూడా అవినీతికి పాల్పడలేదు, కేసులకు, జైలు జీవితానికి భయపడేది లేదని కేటీఆర్ మీడియాలో శివాలెత్తారు. లై డిటెక్టర్ పరీక్షకు సిద్ధమని, హైదరాబాద్ కు లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని, క్విడ్ ప్రో కో లేనే లేదని కేటీఆర్ అదే పనిగా ప్రచారం చేసుకున్నారు. హైదరాబాద్ బ్రాండ్ పెంచాను, లక్ష కోట్ల పెట్టుబడులు వచ్చాయంటూ గొప్పలు చెప్పారు. గవర్నర్ ప్రాసిక్యూషన్ కు అనుమతించడంతో బీఆర్ఎస్ నాయకులు ఇప్పుడేమో రాజకీయ కక్ష సాధింపు చర్యలు అని గగ్గోలు పెడుతున్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్‌ను కట్టడి చేసేందుకు కాంగ్రెస్, బీజేపీ కలిసి పనిచేస్తున్నాయని ఆరోపిస్తున్నారు. కేటీఆర్‌పై అక్రమ కేసులు బనాయించి, ఇబ్బంది పెట్టాలని చూస్తున్నారని దుమ్మెత్తి పోస్తున్నారు. రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పరాకాష్ట ఇది, ప్రశ్నించే గొంతులను నొక్కే ప్రయత్నమంటూ ఆక్రోశిస్తున్నారు.

విచారణకు ఆదేశించడంతో గుట్టు రట్టు

2023 చివరలో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఈ-కారు రేసు నిర్వహణ, నిధుల దుర్వినియోగం, విదేశాలకు మళ్లింపుపై విచారణకు ఆదేశించింది. ఈ కేసు ఇప్పుడు తుది ఘట్టానికి చేరుకుంది. ప్రాసిక్యూషన్ కోసం గవర్నర్ కు రాష్ట్ర ప్రభుత్వం లేఖ పంపిన తరువాత 70 రోజులకు అనుమతి లభించింది. ఈ కేసులో ఏ2 గా ఉన్న ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్ కుమార్‌ను విచారించేందుకు కేంద్ర ప్రభుత్వంలోని డీఓపీటీకి రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాసింది. ఇంకా అనుమతి రాలేదు. ప్రాసిక్యూషన్ కు గవర్నర్ ఆమోదముద్ర వేయడంతో ఫార్ములా ఈ రేసు కేసులో తెలంగాణ అవినీతి నిరోధక విభాగం (ఏసీబీ) త్వరలో చార్జ్‌షీటు దాఖలు చేయనున్నదని సమాచారం. దీంతో కేటీఆర్ పై తదుపరి చర్యలు తీసుకునేందుకు ఏసీబీ కి మార్గం సుగమం అయ్యిందని అంటున్నారు. చార్జ్‌షీట్ దాఖలు చేసిన తరువాత రాష్ట్రంలో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కనున్నది. అప్పటి మునిసిపల్ ముఖ్య కార్యదర్శి ఎం దాన కిశోర్ ఫిర్యాదు మేరకు తెలంగాణ ఏసీబీ డిసెంబర్ 2024 లో కేసు నమోదు చేసింది. ఎఫ్ఐఆర్ లో కేటీఆర్‌ను ఏ1 గా, అర్వింద్ కుమార్ ను ఏ2, ఏ3 గా హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్.రెడ్డి పేర్లను నమోదు చేశారు. విచారణలో భాగంగా కేటీఆర్ ను రెండు సార్లు, అర్వింద్ కుమార్ ను మూడు సార్లు ఏసీబీ విచారించింది.

ఈ కారు రేసుతో జనం ఇబ్బందులు

తెలంగాణ సచివాలయం ముందు ఉన్న ఎన్టీఆర్ మార్గ్‌లో ఈ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల కారణంగా ట్రాఫిక్ అస్తవ్యస్థంగా మారి వాహనదారులు, ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారు. నగరం బయట నిర్వహించాల్సిన పోటీలు నగరం నడిబొడ్డున నిర్వహించడం ఏంటని పలువురు బహిరంగంగానే విమర్శించారు. రోజుల తరబడి ప్రజలు అవస్థలు పడ్డారు. సచివాలయం చుట్టూ ఐదారు కిలోమీటర్ల రేడియస్‌లో ట్రాఫిక్ జామ్ ఏర్పడి వాహనదారులు గంటల తరబడి రోడ్లపై ఇక్కట్ల పాలయ్యారు. వాహనాలను నియంత్రించలేక ట్రాఫిక్ పోలీసులు అష్టకష్టాలు పడ్డారు. ఫార్ములా ఈ రేసు కేసు నిర్వహణ కోసం యునైటెడ్ కింగ్‌డమ్‌కు చెందిన ఫార్ములా ఈ ఆపరేషన్స్, ఏస్ నెక్స్ట్ జెన్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థలతో తెలంగాణ మునిసిపల్ వ్యవహారాల శాఖ 2022 అక్టోబర్ 22వ తేదీన ఒప్పందాలు చేసుకున్నాయి. కారు రేసు నిర్వహించేందుకు వీలుగా సచివాలయం ఎదుట ఎన్టీఆర్ మార్గ్‌లో ప్రత్యేక ట్రాక్ ఏర్పాటు చేయాలి. ఈ ట్రాక్ నిర్మాణం కోసం హెచ్ఎండీఏ రూ.12 కోట్లు 2023 ఫిబ్రవరి నెలలో ఖర్చు చేసింది. రేసు నిర్వహణకు అయ్యే వ్యయాన్ని ఏస్ నెక్స్ట్ జెన్ భరించింది. ఇందులో ప్రధాన నిధుల వ్యయంపై రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం లేకపోవడం, ఆర్థిక శాఖ అనుమతులు తీసుకోకపోవడం, సెక్రెటేరియట్ బిజినెస్ రూల్స్ ఉల్లంఘన, కేంద్ర ఆర్థిక శాఖ అనుమతులు లేకుండా విదేశీ సంస్థలకు నిధులు చెల్లించడం, ఎన్నికల్ కోడ్ వంటి అంశాలు కీలకంగా మారాయి. అప్పటి మంత్రి కేటీఆర్‌తో చేసిన వాట్సప్ చాట్‌లను సీనియర్ ఐఏఎస్ అధికారి అర్వింద్ కుమార్ ఏసీబీ అధికారులకు అందచేశారంటున్నారు. దీంతో కేటీఆర్ తప్పించుకోకుండా పీకల్లోతు కూరుకుపోయినట్లేనని చెబుతున్నారు.

పీసీ యాక్టు సవరణలతో ఆలస్యం

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రివెన్షన్ ఆఫ్ కరప్షన్ యాక్ట్ -1988కు 2018 సంవత్సరంలో అనేక సవరణలు చేసింది. ప్రజా ప్రతినిధులను ప్రాసిక్యూట్ చేసేందుకు రాష్ట్ర గవర్నర్ నుంచి అనుమతులు తీసుకోవాలని స్పష్టం చేసింది. యునైటెడ్ నేషన్స్ వంటి అంతర్జాతీయ సంస్థల నియమావళికి అనుగుణంగా అవినీతికి వ్యతిరేకంగా ఈ సవరణలు తీసుకువచ్చినట్లు కేంద్ర ప్రభుత్వం చెప్పింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం చట్ట ప్రకారం అన్ని అనుమతులు తీసుకుని ముందుకు వెళ్ళక తప్పడం లేదు. కేటీఆర్ ను విచారించేందుకు తొలుత అనుమతులు తీసుకున్నారు. ఇప్పుడు చార్జ్‌షీట్ వేసేందుకు కూడా గవర్నర్ అనుమతించారు. గవర్నర్ అనుమతులు లేకుండా కేసులు పెడితే వెంటనే న్యాయస్థానాల నుంచి బెయిల్ లభిస్తుందని, కేసు నుంచి తప్పించుకునేందుకు వీలుంటుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముందే వెల్లడించిన విషయం తెలిసిందే.

## ఇంట్లోనే గంజాయి మొక్కల పెంపు

అచ్చంపేట, బహిరంగ ప్రదేశాల్లో నిషేదిత గంజాయి పండిస్తే పోలీసులకు దొరికిపోతామన్న భయంతో ఓ యువకుడు ఏకంగా ఇంట్లోనే గంజాయి సాగును మొదలు పెట్టాడు. స్థానికుల ఫిర్యాదు మేరకు ఎట్టకేలకు పోలీసులకు దొరికిపోయాడు. పోలీసులు దాడి జరిపి ఆ యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటన నాగర్ కర్నూల్ జిల్లాలో చోటు చేసుకుంది. జిల్లాలోని అచ్చంపేట మండలం పల్కపల్లి గ్రామంలో నాగనులు మధు అనే యువకుడు గంజాయికి బానిసగా మారి ఇంట్లోనే గంజాయి మొక్కలు పెంచుతున్నాడు. గంజాయి సాగు, అక్రమ రవాణాపై , విక్రయాలపై పోలీసులు గట్టి నిఘా వేయడంతో పాటు తనిఖీలు, దాడులు చేస్తూ గంజాయిని పట్టుకుంటున్నారు.ఈ క్రమంలో సమాచారం అందుకున్న పోలీసులు గ్రామంలోని మధు ఇంటిపై దాడి జరిపి గంజాయి మొక్కను గుర్తించి యువకుడిని అదుపులోకి తీసుకున్న స్టేషన్‌కు

## ఆయుధ వ్యాపారీ సంజయ్ భండారీ కేసు

న్యూఢిల్లీ, కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ భర్త, వ్యాపారవేత్త రాబర్ట్ వాద్రాపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఛార్జిషీట్ దాఖలు చేసింది. బ్రిటన్‌కు చెందిన ఆయుధ వ్యాపారి సంజయ్ భండారీ కేసుతో ముడిపడిన మనీలాండరింగ్ కేసులో ఈ అభియోగ పత్రాన్ని ప్రత్యేక కోర్టులో సమర్పించింది. రాబర్ట్ వాద్రాపై ఇది రెండో మనీలాండరింగ్ ఛార్జిషీట్. ఈ ఏడాది జులైలో షికోపుర్ భూముల వ్యవహారంలో ఈడీ ఆయనపై ఓ అభియోగ పత్రాన్ని దాఖలు చేసిన విషయం తెలిసిందే.దిల్లీలోని ఆయుధ వ్యాపారి సంజయ్ భండారీ ప్రాంగణంపై 2016లో ఆదాయపు పన్ను శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. డిజిటల్ డేటా, ఇతర డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నారు. ఇందులో రాబర్ట్ వాద్రా పేరు వెలుగుచూసిందని, లండన్‌లోని ఓ స్థిరాస్తితో వాద్రాకు సంబంధం ఉందనే ఆరోపణలు వచ్చాయి. ఈ క్రమంలోనే 2017 ఫిబ్రవరిలో ఈడీ 'నగదు అక్రమ చలామణి చట్టం' కింద భండారీ తదితరులపై కేసు నమోదు చేసింది. లండన్‌లోని స్థిరాస్తికి సంబంధించి భండారీతో వాద్రా సంబంధాలపై ఈడీ దర్యాప్తు చేస్తోంది. ఇందులో భాగంగా గతంలో వాద్రాను విచారించింది. ఆయన ఈ ఆరోపణలను ఖండిస్తూ వస్తున్నారు. ఇదిలా ఉండగా.. 2016లో ఐటీ దాడులు జరిగిన వెంటనే సంజయ్ భండారీ లండన్‌కు పారిపోయాడు. అతడి అప్పగింత అభ్యర్థనను బ్రిటన్ కోర్టు తిరస్కరించింది. దిల్లీ కోర్టు జులైలో అతడిని పరారీలో ఉన్న ఆర్థిక నేరస్థుడిగా ప్రకటించింది.

## ప్రజలను హెచ్చరించిన అధికారులు

న్యూఢిల్లీ, ఢిల్లీలో వాయు కాలుష్యం ప్రమాదకర స్థాయిలకు చేరుకుంది. పలు ప్రాంతాల్లో పరిస్థితి అత్యంత దారుణంగా తయారైంది. గత నెల ఢిల్లీ - ఎన్‌సీఆర్ ప్రాంతాల్లోని 80 శాతం ఇళ్లలో విషపు గాలి కారణంగా కనీసం ఒక సభ్యుడు అనారోగ్యానికి గురైనట్లు సర్వేలు చెబుతున్నాయి. గాలి కాలుష్యం కారణంగా ప్రజల ఆయుర్దాయంపై తీవ్ర ప్రభావం పడుతోంది. ఎన్ని చర్యలు తీసుకుంటున్నా కూడా పూర్తి స్థాయిలో ప్రజలకు రక్షణ లభించటం లేదు. మాస్కులు, ఎయిర్ ప్యూర్గి÷యైర్లు కొంత మేరకు మాత్రమే రక్షణ ఇస్తాయని, కాలుష్యాన్ని నియంత్రించడానికి పాలసీలో మార్పులు రావాలని వైద్యులు సూచిస్తున్నారు. కాలుష్యం తీవ్ర స్థాయికి చేరుకున్న నేపథ్యంలో ఢిల్లీ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. స్పోర్ట్స్ యాక్టివిటీస్‌పై నిషేధం విధించింది. ఢిల్లీలో కాలుష్యం పెరుగుతుండటంతో స్పోర్ట్స్ యాక్టివిటీస్ ఆపేయాలని రెండు రోజుల క్రితం దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో ప్రభుత్వం అప్రమత్తం అయింది. సాధారణంగా ఢిల్లీలోని స్కూల్స్ చలికాలంలో స్పోర్ట్స్ మీట్స్ కండక్ట్ చేస్తూ ఉంటాయి. కాలుష్యం పెరగటంతో నవంబర్, డిసెంబర్ నెలలో నిర్వహించే క్రీడలను నిర్వహించొద్దని ఢిల్లీ ప్రభుత్వం స్కూళ్లను ఆదేశించింది. ఇకపోతే ఢిల్లీలో గాలి నాణ్యతలు క్షీణించాయి. ఢిల్లీలో కొన్ని ప్రాంతాల్లో ప్రమాదకర స్థాయిలో గాలి నాణ్యతలు నమోద్యాయి. దీంతో ఆ గాలి ప్రాణాంతకంగా మారుతుందని పలువురు నిపుణులు ఆవేదన వ్యక్తం చేశారు. రాజధాని ప్రాంతంలో 80 శాతం నివాసితులు గాలి నాణ్యతలు క్షీణించడం వల్ల అనారోగ్యాలపాలవుతున్నారు. కనీసం కుటుంబంలో ఒక్కరైనా శ్వాసకోశ సమస్యలతో బాధపడుతున్నారని పలు సర్వేలు వెల్లడించాయి. మాస్కులు, ఎయిర్ ప్యూర్గి÷యైర్లు కొంత రక్షిస్తున్నప్పటికీ.. ఈ సమస్యను పరిష్కరించడానికి ఏడాది పొడవునా కచ్చితమైన విధాన మార్పు అవసరమని వైద్యులు సూచించారు. శుక్రవారం ఉదయం 9 గంటల సమయానికి ఎక్యూఐ 370 స్థాయి వద్ద నమోదైంది. దీంతో వీటి స్థాయిల్ని కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి వెరీపూర్ కేటగిరీలో వర్గీకరించింది. ఢిల్లీలో కొన్ని ప్రాంతాల్లో ఎక్యూఐ తీవ్ర స్థాయిలో నమోదైంది. చాందినీ చౌక్, ఆనంద్ విహార్, ముండ్కా, బవానా, నరేలా, డిటియు- వజీర్‌పూర్‌లలో 400కి పైగా ఎక్యూఐ నమోదైంది. 18 పర్యవేక్షణా కేంద్రాల్లో 400 పైగానే ఎక్యూఐ నమోదైంది. గత కొన్ని రోజుల్లోనే కాకుండా.. వచ్చే వారంలో ఆరు రోజులు కూడా తీవ్ర ప్రమాదకర స్థాయిలోనే గాలి నాణ్యతలు నమోదయ్యే అవకాశం ఉందని భూశాస్త్రాల మంత్రిత్వశాఖ అంచనా వేసింది. గాలి కదలికలు సరిగ్గా లేకపోవడం, శీతాకాలం కారణంగా గాలి నాణ్యతలు ప్రమాదకర స్థాయిలో నమోదయ్యే అవకాశం ఉందని తెలిపింది. ఢిల్లీలో గాలి ఎంత కాలుష్యంగా ఉందో నెట్టింట వైరల్ అవుతున్న ఫొటోలే నిదర్శనం. దేశ రాజధానిలో వాయు కాలుష్యం పెరిగిపోవటానికి పంట వ్యర్థాలను తగలబెట్టడం ప్రధాన కారణం అవుతోంది. ఢిల్లీ చుట్టు పక్కల ఉండే రాష్ట్రాల ప్రజలు పెద్ద సంఖ్యలో పంట వ్యర్థాలను తగలబెడుతూ ఉన్నారు. దాని కారణంగా ఢిల్లీలో కాలుష్యం పెరుగుతోంది. అధికారులు పోలీస్ కేసులు నమోదు చేస్తున్నా.. భార్గీ ÷న్లు వేస్తున్నా కూడా రైతులు మారటం లేదు. పంట వ్యర్థాలను కాలుస్తూనే ఉన్నారు.

## ఎన్‌కౌంటర్లపై మావోల ఆగ్రహం

రాయపూర్, మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు, ఆ పార్టీ అగ్రనేత హిడ్మాతో పాటు పలువురిని పోలీసులు క్రూరంగా హత్య చేసి ఎన్‌కౌంటర్‌గా చిత్రీకరించారంటూ మావోయిస్టు పార్టీ ఆరోపించింది. అందుకు నిరసనగా నవంబర్ 23వ తేదీన భారత్ బంద్‌కు పిలుపునిచ్చింది. ఈ మేరకు మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి అభయ్ పేరిట శుక్రవారం లేఖ విడుదల చేసింది. పోలీసుల క్రూర హత్యకు నిరసనగా దేశవ్యాప్తంగా బంద్‌కు పిలుపు ఇచ్చినట్లు వివరించింది.నవంబర్ 18వ తేదీ ఉదయం అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం అటవీ ప్రాంతం సమీపంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో హిడ్మా, ఆయన భార్య రాజేతోపాటు పలువురు మావోయిస్టులు మృతి చెందారు. వారి మృతదేహాలకు రంప చోడవరం ఏరియా ఆసుపత్రిలో పోస్ట్‌మార్టం నిర్వహించి.. ఛత్తీస్‌గఢ్ సుక్మా జిల్లాలోని పువ్వర్తి గ్రామానికి తరలించారు. ఈ మృతదేహాలకు హిడ్మా కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. ఏడాది మేలో ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో 28 మంది మావోయిస్టులు మరణించారు. ఈ ఎన్‌కౌంటర్‌లో పార్టీ అగ్రనేత సంబాల కేశవరావు అలియాస్ బసవరాజు మరణించారు. ఈ ఎన్‌కౌంటర్‌ను నిరసిస్తూ.. జూన్ 10వ తేదీన భారత్ బంద్‌కు మావోయిస్టు పార్టీ పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. తాజాగా ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో హిడ్మాతోపాటు పలువురు మావోయిస్టులు మృతి చెందడంతో.. నవంబర్ 23వ తేదీ ఆదివారం భారత్ బంద్‌కు పార్టీ పిలుపునిచ్చింది. 2026, మార్చి నెలాఖరు నాటికి దేశంలో మావోయిస్టులను నిర్మూలిస్తామని కేంద్రం ప్రకటించింది. మావోయిస్టులు లొంగిపోయి.. జన జీవన స్రవంతిలో కలిసి దేశాభివృద్ధికి పాటుపడాలని కేంద్రం పిలుపునిచ్చింది. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో మావోయిస్టులు పూర్తిగా తుడిచి పెట్టుకుపోయారు. ఛత్తీస్‌గఢ్‌లో వీరి ప్రాబల్యం అధికంగా ఉంది. భద్రతా బలగాలతో కూంబింగ్ నిర్వహిస్తోంది. వరుస ఎన్‌కౌంటర్లతో వందలాది మంది మావోయిస్టులు మరణించారు. పలువురు మావోయిస్టులు అరెస్టయ్యారు. ఇంకొందరు ప్రభుత్వం ఎదుట లొంగిపోయారు. వరుస ఎన్‌కౌంటర్లతో మావోయిస్టు పార్టీకి తీవ్ర నష్టం వాటిల్లింది. దేశంలో ఆ పార్టీ దాదాపుగా కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడింది.

# రాయపూర్‌లో మూడ్రోజుల పాటు డిజిపిల సమావేశం

రాయపూర్,ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్‌లో ఈ నెల 28 నుంచి 30 వరకు అన్ని రాష్ట్రాల డీజీపీల సమావేశం జరగనున్నది. ఈ సమావేశానికి ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర హోంశాఖమంత్రి అమిత్‌షా హాజరుకానున్నారు. ఈ సమావేశంలో అన్ని రాష్ట్రాల డీజీపీలు, ఐజీలు, సీనియర్ అధికారులు పాల్గొంటారు. ఈ వార్షిక సమావేశంలో ప్రధానంగా ఆపరేషన్ కగార్ పురోగతి, ఉగ్రవాద దాడుల నిరోధక వ్యూహాలు ప్రధాన అజెండాగా ఉండనున్నాయని తెలిసింది. మావోయిస్టుల లొంగుబాట్లు, వరుస ఎన్‌కౌంటర్లు జరుగుతున్న నేపథ్యంలో ప్రధాని, కేంద్ర హోంమంత్రి హాజరవుతుండటంతో సమావేశానికి మరింత ప్రాధాన్యత ఏర్పడింది. ఈ నేపథ్యంలోనే కేంద్రం, ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం భారీ స్థాయిలో భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. ప్రత్యేక కమాండోలు, సీఆర్‌పీఎఫ్, ఎన్ఐఏ, ఐబీ బృందాలు రాయ్‌పూర్ చేరుకుని వ్యూహాత్మక భద్రతా ప్రణాళికను అమలు చేస్తున్నాయి. ఈ సమావేశానికి తెలంగాణ డీజీపీ శివధర్‌రెడ్డి, ఇంటెలిజెన్స్ డీజీ విజయ్‌కుమార్, ఎస్ఐబీ చీఫ్ సుమతి తదితరులు హాజరుకానున్నారు. శాటిలైట్ నిఘా, డ్రోన్ పెట్రోలింగ్, గ్రౌండ్ ఆపరేషన్స్ ను మరింత సమర్ధవంతంగా మార్చడంపై కీలక నిర్ణయాలు తీసుకుంటారని అధికారవర్గాలు చెప్తున్నాయి. ఇటీవలి వరుస ఎన్‌కౌంటర్లు, హిడ్మా తదితరుల హతం తరవాత దీనికి ప్రత్యేకత ఏర్పడింది.

# నిఖత్ జరీన్ పోలీస్ శాఖకు గర్వకారణం

హైదరాబాద్,ప్రపంచ బాక్సింగ్ కప్ ఫైనల్స్‌లో తెలంగాణ బాక్సర్ నిఖత్ జరీన్ గోల్డ్ మెడల్ సాధించడం పట్ల తెలంగాణ డీజీపీ బీ. శివధర్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ స్పెషల్ పోలీస్ డీఎస్పీ నిఖత్ జరీన్‌ను అభినందించారు. మహిళల 51 కేజీల ఫైనల్స్‌లో తన ప్రత్యర్థిపై 5-0 తేడాతో ఘన విజయం సాధించడం ఆమె సామర్థ్యానికి, అంకితభావానికి నిదర్శనమని కొనియాడారు. 'గోల్డ్ మెడల్ సాధించి తెలంగాణ పోలీస్ శాఖకు గర్వకారణంగా నిలిచిన నిఖత్ జరీన్‌ను అభినందిస్తున్నాను. క్రీడల్లో అత్యున్నత ప్రమాణాలు నెలకొల్పిన నిఖత్ విజయం ఇతర క్రీడాకారులకు ఆదర్శం' అని పేర్కొన్నారు. తెలంగాణ పోలీస్ కుటుంబం తరపున నిఖత్ జరీన్ భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలు అధిరోహించాలని డీజీపీ ఆకాంక్షించారు. ఇదిలావుంటే సీఐడీ విభాగంలో నేర విశ్లేషణ, సాంకేతికత కోసం క్రైమ్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీ ఎనాలసిస్ పేరుతో ప్రత్యేక వింగ్‌ను ఏర్పాటు చేసినట్టు డీజీపీ శివధర్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో మానవ అక్రమ రవాణాను అరికట్టేందుకు ఎంపిక చేసిన జిల్లాల్లో 'సేఫ్ విలేజ్' కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించనున్నట్టు వెల్లడించారు. ఈ మేరకు రాష్ట్రంలోని పోలీస్ కమిషనర్లు, ఎస్పీలతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. తీవ్రమైన నేరాలు, ఆర్థిక నేరాలు, బాలలకు సంబంధించిన నేరాలపై లోతుగా చర్చించారు. రాష్ట్రంలోని ఏడు జిల్లాల పరిధిలో 'సేఫ్ విలేజ్ ప్రోగ్రాం'ను విస్తృతంగా నిర్వహించనున్నట్టు తెలిపారు.

# చిచ్చు పెట్టిన ఉప ఎన్నిక?

హైదరాబాద్,జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఫలితాల్లో కనీసం డిపాజిట్ కూడా దక్కించుకోలేని భారతీయ జనతాపార్టీ వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో అధికారంలోకి వస్తుందా? అంటే ఎవరూ నమ్మలేని పరిస్థితికి ఆ పార్టీ చేరుకుంది. బండి సంజయ్ పార్టీ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో అధికారంలోకి రావాల్సిన తరుణంలో.. పార్టీ అధ్యక్షుడిని మార్చి ఒకరకంగా బీజేపీ ఆత్మహత్య చేసుకుందని ఇప్పటికీ రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతుంటారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు అభ్యర్థిని ఆలస్యంగా ప్రకటించడం కూడా కావాలనే చేశారని, ఒక పార్టీకి అనుకూలంగా ఉండేందుకే ఇలా వ్యవహరించారంటూ ఆరోపణలు వచ్చాయి.

డివిజన్ పాలిటిక్స్ మానుకోవాలి

అయితే ఈ ఎన్నికలో ఓటమి పార్టీలో అంతర్గత విభేదాలకు దారి తీసింది. కేంద్ర మంత్రిగా ఉన్న బండి సంజయ్, మల్కాజిగిరి నియోజకవర్గం నుంచి ఎంపీగా ఉన్న ఈటల రాజేందర్ మధ్య ప్రచ్ఛన్న యుద్ధం నడుస్తోందనేది పార్టీ వర్గాల్లోనే గుసగుసలు వినిపిస్తున్నాయి. ఓటమికి వీరిద్దరి మధ్య సమన్వయ లోపమే కారణమని పార్టీ శ్రేణులే అంటున్నాయి. ఫలితాలు వచ్చిన తర్వాత ఈటల రాజేందర్ కు, బీజేపీ కార్యకర్తల మధ్య మాటల యుద్ధం నడిచింది. ఈటల డివిజన్ పాలిటిక్స్ మానుకోవాలని, లేదంటే పార్టీ గెలుపు కష్టమని, తాను హిందూయిజాన్ని వదిలిపెడితే.. భౌతికంగా తానున్నా లేనట్లేనంటూ బండి సంజయ్ భావోద్వేగానికి గురయ్యారు.

మత సిద్ధాంతాన్ని వ్యతిరేకిస్తున్న ఈటల

కేంద్ర మంత్రిగా ఉన్న కిషన్ రెడ్డి అన్ని బాధ్యతలు తీసుకున్నప్పటికీ పార్టీని మాత్రం గెలిపించలేకపోయారు. ఆయన రాజకీయం ఏమిటనేది ఆ పార్టీ శ్రేణులకు కూడా అంతుపట్టకుండా ఉంటుంది. ప్రచారం కూడా సరిగా చేయలేదు. నాయకులందరి మధ్య విభేదాలున్నాయనేది బహిరంగ రహస్యం. ఇలాంటి విభేదాలే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీ గెలుపునకు గండి కొడుతూ పరోక్షంగా కాంగ్రెస్ పార్టీకి మేలు చేస్తున్నాయి. అయతే ఈటల రాజేందర్ మాత్రం బీజేపీకి పునాది లాంటి మత సిద్ధాంతాన్ని వ్యతిరేకిస్తున్నారు. మత రాజకీయమాలు మంచివి కావంటున్నారు. ఆయన కూడా ఇతర నేతలు డివిజన్ పాలిటిక్స్ మానుకోవాలని వ్యాఖ్యలు చేశారు.

గట్టి పోటీ ఇస్తుందనే నమ్మకాలు లేవు

వచ్చే అసెంబ్లీ ఎన్నికల సమయానికి పార్టీని బలోపేతం చేసి అధికారంలోకి తెస్తారని కలలు కంటున్న బీజేపీ నాయకులు, కార్యకర్తలకు ఈ ప్రధాన నేతల మధ్య ఉన్న విభేదాలు, జరుగుతున్న మాటల యుద్ధం పార్టీని బలహీనపరుస్తోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. రామచంద్రరావును అధ్యక్షుడిగా చేసినా బీజేపీ రాత మారలేదు. ఎమ్మెల్యేలమీద కూడా ఎవరికీ అదుపు లేదు. వారిష్టమొచ్చినరీతిలో వారు వ్యవహరిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల మధ్య తనను తాను మార్చుకొని రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ కు, బీఆర్ఎస్ కు గట్టి పోటీ ఇస్తుందనే నమ్మకాలైతే కనపడటంలేదనే వ్యాఖ్యలు వినవస్తున్నాయి.

# సభాహక్కుల కమిటీ ముందు రావాల్సిందే

అమరావతి,సభాహక్కుల కమిటీకి జగన్ మీడియా ఎందుకు భయపడుతోందని తెదేపా సీనియర్ నేత యనమల రామకృష్ణుడు ప్రశ్నించారు. తప్పుడు వార్తలు రాసి.. ఇప్పుడు ప్రొసీడింగ్స్‌ను అడ్డుకుంటారా అని ప్రశ్నించారు. సాక్షిలో తప్పుడు వార్తలపై అసెంబ్లీకి వచ్చి వివరణ ఇవ్వొచ్చన్నారు. ఎమ్మెల్యేలకు శిక్షణ తరగతుల పేరుతో రూ.కోట్ల ప్రజాధనాన్ని వృథా చేశారంటూ శాసనసభ, సభాపతిని చులకన చేసేలా సాక్షిలో కథనం ప్రచురించిన విషయం తెలిసిందే. ఇకపోతే గురువారం హైదరాబాద్‌లో నాంపల్లి సీబీఐ కోర్టుకు హాజరయ్యే సమయంలో జగన్ బలప్రదర్శన చేసిన తీరును కూడా యనమల తప్పుబట్టారు. కోర్టుకు హాజరు కావాలంటే, నేరస్థుడిగా ఆరోపించబడిన వ్యక్తి ప్రజలకు ఇబ్బంది కలిగించాల్సిన అవసరం లేదు.

# తెలంగాణ మణిహారం ట్రిపుల్ ఆర్‌పై నిర్లక్ష్యం!




హైదరాబాద్, గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఔటర్ రింగ్ రోడ్డు ప్రాజెక్టు పనులు ఎంత వేగిరంగా సాగాయో అంతకు భిన్నంగా ట్రిపుల్ ఆర్ పనులు జరుగుతున్నాయని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ఇలాగే సాగితే పదేళ్లు అయినా రోడ్డు పనులు పూర్తి కావని వ్యాఖ్యానిస్తున్నారు. ఫ్యూచర్ సిటీపై చూపిస్తున్న శ్రద్ధ ట్రిపుల్ ఆర్ పై చూపించం లేదనే విమర్శలు బలంగా ఉన్నాయి. వచ్చే డిసెంబర్ లోపు టెండర్ పూర్తి చేసి జనవరిలో పనులు ప్రారంభిస్తామని గత నెల ఆర్‌అండ్‌బీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ప్రకటించారు. కానీ.. ఆచరణ మాత్రం ఆ దిశగా లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఔటర్ రింగ్ రోడ్డు ఆవల 340 కిలోమీటర్ల పొడవున నిర్మించే రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్‌ఆర్‌ఆర్)కు 2010లో అంకురార్పణ చేశారు. అప్పట్లో హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ దీన్ని పెరిఫరల్ రింగ్ రోడ్డుగా ప్రతిపాదించింది. 2017లో కేంద్రం 'భారత్ మాల పరియోజన' ఫేజ్ 1లో దీన్ని చేర్చింది. సర్వేలు, అలైన్‌మెంట్ ఖరారు, అధ్యయనంపై 2020 నుంచి 2023 వరకు ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం కాలయాపన చేసిన విషయం తెలిసిందే. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత 2024లో భూ సేకరణలో యాభై శాతం భరించేందుకు సంసిద్ధత వ్యక్తం చేసింది. ఉత్తర భాగంలో పనులు చేపట్టేందుకు టెండర్లు, దక్షిణ భాగంలో సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) రూపకల్పనకు టెండర్లు ఆహ్వానించారు. 2028 నాటికి ప్రాజెక్టు పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించుకున్న ప్రభుత్వం అందుకు తగ్గట్టుగా చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి.

ఈ రోడ్డుతో ఎన్నో ప్రయోజనాలు

ట్రిపుల్ ఆర్ నిర్మాణంతో ఔట్ రింగ్ రోడ్డుపై ట్రాఫిక్ రద్దీ తగ్గడమే కాకుండా సరుకు రవాణా వాహనాలు, లాజిస్టిక్స్ హబ్‌లు, జాతీయ రహదారుల మధ్య కనెక్టివిటీ పెరిగి వేగంగా గమ్యస్థానాలు చేరుకుంటాయి. ఔటర్ రింగ్ రోడ్డు, రీజినల్ రింగ్ రోడ్డు మధ్య రేడియల్ రోడ్ల నిర్మాణంతో ట్రాఫిక్ రద్దీ తగ్గుతుంది. వేర్‌హౌస్‌లు, లాజిస్టిక్, పరిశ్రమల ఏర్పాటుతో ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి పెరుగుతుంది. నిర్మాణ రంగానికి ఎంతో మేలు జరుగుతుంది. సంగారెడ్డి, సిద్ధిపేట, నల్లగొండలో వ్యవసాయ అనుబంధ రంగాల ఉత్పత్తుల పరిశ్రమలు ఏర్పాటు అవుతాయి. నగరంలో ఒత్తిడి తగ్గేలా చేవెళ్ల, భువనగిరి, ఆమనగల్, చౌటుప్పల్, కందుకూరు, తూప్రాన్ ప్రాంతాలు పట్టణాలుగా అవతరిస్తాయి. మెరుగైన రవాణా కారణంగా పరిశ్రమల ఏర్పాటుకు పలువురు ముందుకు వస్తారు. రియల్ ఎస్టేట్ రంగం, రిటైల్ వ్యాపారం, సేవా రంగాల్లో ఊహించని ప్రగతి చోటుచేసుకుంటుంది.

ఆరు లేన్లకు విస్తరించేలా భూసేకరణ

ప్రస్తుతం నాలుగు లేన్లకే పరిమితం చేసినా ఆరు లేన్లకు విస్తరించేందుకు వీలుగా భూ సేకరణ చేస్తున్నారు. ఇంటెలిజెన్స్ ట్రాన్స్ పోర్టు సిస్టమ్ దీని ప్రత్యేకత. ప్రాంతీయ బస్ స్టేషన్లను కలుపుతూ కొత్తగా రానున్న సబ్ అర్బన్ జోన్లను అనుసంధానం చేస్తారు. ట్రిపుల్ ఆర్ వెంట పారిశ్రామిక ప్రాంతాలు, జంక్షన్లు, టౌన్ షిప్‌లు రానున్నాయి. చేవెళ్ళ, తూఫ్రాన్, షాద్‌నగర్‌లలో శాటిలైట్ టౌన్‌షిప్‌లు, సంగారెడ్డి, భువనగిరి, చౌటుప్పల్ ప్రాంతాల్లో లాజిస్టిక్‌లు, వేర్ హౌసింగ్ హబ్‌లు, దక్షిణ ప్రాంతంలో ఫార్మా సిటీ, ఈ సీటీ వంటి ఇండస్ట్రియల్ పార్కులు రానున్నాయి. జంక్షన్లకు సమీపంలో ప్రైవేటు యూనివర్సిటీలు, ప్రముఖ విద్యా సంస్థలు ఏర్పాటు చేసే అవకాశాలూ ఉన్నాయి.

రియల్ ఎస్టేట్‌కు బూమ్!

రీజినల్ రింగ్ రోడ్డును ఉత్తర భాగంలో 164 కిలో మీటర్లు, దక్షిణ భాగంలో 182 కిలో మీటర్లుగా విభజించారు. షాద్‌నగర్, చేవెళ్ల, భువనగిరి ప్రాంతాలు రియల్ ఎస్టేట్‌కు కేంద్రాలుగా మారుతాయన్న అంచనాలు పెరుగుతున్నాయి. అంతర్జాతీయ విమానాశ్రయం, బెంగళూరు జాతీయ రహదారికి పక్కనే ఉండటం షాద్‌నగర్‌కు కలిసొచ్చే అంశం. ఇక్కడి నుంచి కర్ణాటకలోని రాయచూర్‌కు వెళ్ళడానికి రోడ్డు ఉంది. దీంతో ఇక్కడ ఇప్పటికే రెసిడెన్షియల్ లే అవుట్లు వేశారు. చేవెళ్లలో పెద్ద ఎత్తున భూములు ఉన్నాయి. హైదరాబాద్ %-% బీజాపూర్ జాతీయ రహదారి పనులు ప్రారంభించడంతో చేవెళ్లలో మున్ముందు శాటిలైట్ టౌన్‌షిప్‌లు వెలిసే అవకాశాలు పెరిగాయి. యాదగిరిగుట్ట ఆలయం, వరంగల్‌కు వెళ్లే జాతీయ రహదారి పక్కనే భువనగిరి ఉంది. యాదగిరి గుట్ట వరకు దక్షిణ మధ్య రైల్వే మూడో రైల్వే లైను నిర్మాణం చేస్తున్నది. దీంతో ఈ ప్రాంతం కూడా అభివృద్ధి చెందనున్నది. యాదగిరి గుట్టకు ప్రతినిత్యం వేల మంది భక్తులు వెళ్లి దర్శనం చేసుకుంటుండటంతో ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతున్నది.

8 లేన్లతో ఓఆర్ఆర్

వైఎస్ రాజశేఖర్ రెడ్డి సీఎంగా ఉన్న సమయంలో 8 లేన్లతో 158 కిలోమీటర్ల పొడవున ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణం చేశారు. హైదరాబాద్ మహా నగరంలో ట్రాఫిక్ ఒత్తిడి తగ్గించేందుకు దీన్ని ప్రతిపాదించారు. ఈ ప్రాజెక్టు కోసం తార్నాకలో స్పెషల్ పర్పస్ వెహికిల్ (ఎస్పీవీ) ఏర్పాటు చేసి, ఒక ఐఏఎస్ అధికారికి అప్పగించారు. భూ సేకరణ కోసం ప్రత్యేకంగా డిప్యూటీ కలెక్టర్లను భూ సేకరణ అధికారులుగా, రోడ్డు పనుల కోసం ఇంజినీర్లను పెద్ద ఎత్తున నియమించారు. అప్పటి ముఖ్యమంత్రి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతో పనులు చాలా వేగంగా పూర్తయ్యాయి. ఇప్పుడది హైదరాబాద్ మహా నగర ముఖచిత్రాన్నే మార్చివేసింది. ఓఆర్ఆర్ వరకు ప్రస్తుతం ఖాళీ స్థలాల లభ్యత లేదు. ఓఆర్ఆర్ కు ఇరువైపులా రెసిడెన్షియల్, కమర్షియల్ లే అవుట్‌లు రావడంతో రద్దీ పెరిగిపోయింది. నగరంలో ట్రాఫిక్ రద్దీ, వాయు కాలుష్యం బారి నుంచి బయటపడేందుకు ఓఆర్ఆర్ చుట్టు పక్కల ప్రాంతాలకు ప్రజలు తరలివెళు తున్నారు. దీంతో హైదరాబాద్ నగరంలో ప్రముఖ ప్రాంతాలలో భూముల కొనుగోలు కొంత మందగించిందనే చెప్పాలి.

ఫ్యూచర్ సిటీకి ఐఏఎస్, ట్రిపుల్ ఆర్‌కు టాస్క్ ఫోర్స్!

రంగారెడ్డి జిల్లాలో ఫ్యూచర్ సిటీ కోసం ముఖ్యమంత్రి చైర్మన్‌గా, మునిసిపల్ శాఖ మంత్రి వైస్ చైర్మన్‌గా ఫ్యూచర్ సిటీ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటు చేశారు. ఏడు మండలాలలోని 56 రెవెన్యూ గ్రామాలు దీని పరిధిలోకి రానున్నాయి. సెప్టెంబర్ నెలలో కందుకూరు మండలం మీర్‌ఖాన్ పేటలో ఫ్యూచర్ సిటీ కార్యాలయాన్ని కూడా ముఖ్యమంత్రి ప్రారంభించారు. అంతకు ముందు నానక్‌రామ్‌గూడలో తాత్కాలిక కార్యాలయాన్ని మార్చి నెలలో ఏర్పాటు చేశారు. ఏప్రిల్ నెలలో రంగారెడ్డి జిల్లా మాజీ కలెక్టర్ కే శశాంకను కమిషనర్‌గా నియమించి, ప్రభుత్వ ఉద్యోగులను కూడా కేటాయించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డ్రీమ్ ప్రాజెక్టు కావడంతో చకచకా ఉత్తర్వులు, నియామకాలు చేస్తున్నారనే అభిప్రాయాలు కూడా ఉన్నాయి. అదే ట్రిపుల్ ఆర్ విషయంలో అంత వేగంగా నిర్ణయాలు జరగడం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి. హెచ్‌ఎండీఏ పరిధిలో పనులు జరుగుతున్నాయి. ఇందుకోసం ప్రత్యేక వ్యవస్థను ఇప్పటి వరకు ఏర్పాటు చేయకపోవడం కూడా పెద్ద లోటుగా చెప్పుకోవచ్చు. ఇప్పటికైనా స్పెషల్ పర్పస్ వెహికిల్ ఏర్పాటు చేసి ప్రత్యేకంగా ఐఏఎస్ అధికారిని నియమించాలని ప్రజలు, ప్రజా ప్రతినిధులు కోరుతున్నారు.

# అంతరిక్ష ప్రయాణమే సులువు

బెంగళూరు, బెంగళూరులో రోడ్ల దుస్థితి , ట్రాఫిక్ సమస్యలపై విమర్శల వర్షం కొనసాగుతూనే ఉన్నది. బయోకాన్ చైర్‌పర్సన్ కిరణ్ మజుందార్ షా, ఇన్ఫోసిస్ మాజీ సీఎఫ్‌వో మోహన్‌దాస్ వంటి ప్రముఖులు కూడా ఈ సమస్యలను లేవనెత్తారు. ఇక ఆన్‌లైన్ ట్రక్కింగ్ స్టార్టప్ బ్లాక్‌బక్ సీఈవో రాజేశ్ యాబాజీ ఏకంగా తమ ఆఫీస్‌ను బెంగళూరు నుంచి మార్చేస్తున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. తాజాగా ఈ జాబితాలో వ్యోమగామి శుభాన్షు శుక్లా కూడా చేరారు. అంతరిక్షంలో ప్రయాణించ డమే తేలిక..అంటూ బెంగళూరు ట్రాఫిక్‌పై వ్యోమగామి శుభాన్షు శుక్లా కామెంట్ చేశారు. అంతరిక్షయానంపై తాను చేసే ప్రసంగ సమయంతో పోలిస్తే బెంగళూరు రహదారులపై ప్రయాణం మూడు రెట్లు అధికమని వ్యోమగామి శుభాన్షు శుక్లా చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారయి. గురువారం బెంగళూరు టెక్నాలజీ సమ్మిట్ లో 'ఫ్యూచర్ మేకర్స్ కాంక్లేవ్'కు హాజరయ్యే క్రమంలో మారతహళ్లి నుంచి మూడు గంటలపాటు ప్రయాణం చేయాల్సి వచ్చిందని శుక్లా పేర్కొన్నారు. ఇందులో మూడో వంతు సమయంలోనే తాను ప్రసంగాన్ని పూర్తి చేశానన్నారు. గత జూన్‌లో 'యాగ్జియం మిషన్' ద్వారా చేపట్టిన అంతరిక్ష ప్రయాణంపై ఆయన మాట్లాడుతూ అంతరిక్షంలో అడుగుపెట్టాక మన గుండెపై మోటారు వాహనం ప్రయాణించినట్లు ఉంటుందన్నారు. అక్కడి పరిస్థితులకు అలవాటు పడేందుకు కనీసం వారం రోజులు పడుతుందని వివరించారు. భూమికి వచ్చాక రెండు వారాలపాటు మన శరీరం అదుపు తప్పే ఉంటుందని తన అనుభవాన్ని వివరించారు. ఈ ప్రయాణం భారతీయ అంతరిక్ష విజయానికి ప్రతీక అని తెలిశాక గర్వంగా ఉందన్నారు. మనకు, మన అంతరిక్ష ప్రగతికి హద్దుల్లేవని ప్రకటించారు. అంతరిక్షం నుంచి భారతదేశం ఎలా కనపడుతుందో శుభాన్షు వీడియో రూపంలో చూపారు. ఈ సందర్భంగా ఆయన బెంగళూరు రోడ్లు, ట్రాఫిక్ సమస్యపైనా చేసిన కామెంట్స్ వైరల్‌గా మారాయి. దేశ ఐటీ రాజధానిలో జరిగిన బెంగళూరు టెక్నాలజీ సమ్మిట్ లో 'ఫ్యూచర్ మేకర్స్ కాంక్లేవ్'కు శుభాన్షు శుక్లా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు తాను మారతహళ్లి నుంచి ఎగ్జిబిషన్ సెంటర్‌కు మూడు గంటలు ప్రయాణం చేయాల్సి వచ్చింది. ఇందులో మూడో వంతు సమయంలో నే తాను ప్రసంగాన్ని పూర్తి చేశానంటూ వ్యాఖ్యానించారు. మారతహళ్లి నుంచి బీఈఎస్ వేదిక అయిన బెంగళూరు ఇంటర్నేషనల్ ఎగ్జిబిషన్ సెంటర్‌కు మధ్య 34 కిలోమీటర్ల దూరం ఉంటుంది. సాధారణంగా ఒక గంటలో ప్రయాణించవచ్చు.

# అక్రమ బొగ్గు మైనింగ్.. 40 చోట్ల ఈడీ తనిఖీలు

రాంచీ: పశ్చిమ బెంగాల్, జార?ండ్ రాష్ట్రాల్లోని 40 ప్రదేశాల్లో ఇవాళ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ తనిఖీలు చేస్తున్నది. అక్రమ బొగ్గు మైనింగ్, రవాణా, స్టోరేజ్ కేసులో ఈ సోదాలు జరుగుతున్నాయి. బెంగాల్‌లోని 24 ప్రాంతాలు, జార?ండ్‌లోని 18 ప్రదేశాల్లో తనిఖీలు నిర్వహిస్తున్నారు. బెంగాల్‌లోని దుర్గాపూర్, పురిలియా, హౌరా, కోల్‌కతా జిల్లాల్లో సోదాలు జరుగుతున్నాయి. బొగ్గు చోరీ, స్మగ్లింగ్‌కు సంబంధించిన పలు కేసుల్లో ఈడీ ఈ తనిఖీలు కొనసాగిస్తున్నది. భారీ ఎత్తున బొగ్గు మాయం అయిన ఘటనల వల్ల ప్రభుత్వానికి తీవ్ర ఆర్థిక నష్టం ఏర్పడింది. సుమారు వందల కోట్లల్లో నష్టం ఉంటుందని ఈడీ పేర్కొన్నది.నరేంద్ర ఖార్కా, యుదిష్టర్ ఘోష్, కృష్ణ మురారి కయాల్, చిన్మయి మోండల్, రాజ్‌కోషరే యాదవ్‌కు చెందిన ప్రదేశాల్లో సోదాలు జరుగుతున్నాయి. బొగ్గు మాఫియాకు పాల్పడుతున్న వారిపై సుమారు వందకుపైగా ఈడీ అధికారులు ఇవాళ దాడులు నిర్వహిస్తున్నారు. శుక్రవారం ఉదయం ఆరు గంటలకే సెర్చ్ ఆపరేషన్ మొదలైంది. రెసిడెన్షియల్ ప్రాపర్టీలు, ఆఫీసులు, కోక్ ప్లాంట్లు, అక్రమ టోల్ వసూళ్లు, చెక్‌పోస్టులు, నాకాలపై దాడులు కొనసాగుతున్నాయి.

# తెలంగాణలో బీజేపీ పరిస్థితి ఏంటి!



హైదరాబాద్, తెలంగాణలో ఏపీ ఫార్ములా వర్క్ అవ్వదా? ఏపీలో సమిష్టగా పని చేసిన కూటమి నేతలు అఖండ మెజార్టీతో అధికారంలోకి వచ్చారు ఆ స్థాయిలో తెలంగాణలో నేతలు పని చేయడం లేదా? జూబ్లీహిల్స్ బైపోల్స్‌లో బీజేపీ ఘోర పరాజయానికి కారణం అదేనా? ఆ క్రమంలో రాబోయే రోజుల్లో జరిగే ఎన్నికల్లో బీజేపీ, టీడీపీ, జనసేన తెలంగాణలో ఏ విధంగా రాజకీయం చేయబోతున్నాయనేది హాట్ టాపిక్‌గా మారింది.

బీజేపీకి మద్దతు ప్రకటించిన జనసేన, టీడీపీలు

జూబ్లీహిల్స్ బైపోల్‌లో ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలుగా ఉన్న టీడీపీ ,జనసేన పార్టీలు కమలం పార్టీ అభ్యర్థికి మద్దతు ప్రకటించాయి. ఏపీలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ పార్టీ జనసేన, బీజేపీతో కూటమిగా ఏర్పడి ఎన్నికలకు వెళ్లింది. ఏపీలోని 175 అసెంబ్లీ స్థానాల్లో ఏకంగా 164 స్థానాల్లో విజయం సాధించింది. అదే కూటమిని తెలంగాణలోనూ కొనసాగిస్తామని టీడీపీ అధినేత చంద్రబాబు ప్రకటించారు. అందులో భాగంగానే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో తొలి అడుగు వేశారు. ఆపార్టీ జాతీయ నాయకత్వంతో కలిసి ఇదే విషయం చెప్పారు. బీజేపీకి టీడీపీ, జనసేన మద్దతు తెలిపాయి. అయితే బీజేపీ నుంచి పోటీ చేసిన లంకల దీపక్ రెడ్డి ఓట్లు రాబట్టడంలో విఫలమయ్యాయి.

ఒక్క డివిజన్‌లోనూ పోటీ ఇవ్వలేకపోయిన బీజేపీ

నియోజకవర్గంలో 6 డివిజన్లు ఉంటే ఏ ఒక్క డివిజన్ లోనూ బీజేపీ పోటీ ఇవ్వలేకపోయింది. కనీసం చెప్పుకోదగిన ఓట్లను సైతం సాధించలేకపోవడం హాట్ టాపిక్‌గా మారింది. 2023లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ నుంచి పోటీ చేసిన లంకల దీపక్ రెడ్డి 25,866 ఓట్లురాగా, ఈ ఉప ఎన్నికల్లో కేవలం 17,061 ఓట్లు మాత్రమే వచ్చాయి. సార్వత్రిక ఎన్నికల్లో ఒంటరిగా బీజేపీ బరిలో దిగి డిపాజిట్ తెచ్చుకుంది. ఇప్పుడు కూటమితో వెళ్లి డిపాజిట్ కోల్పోవడం చర్చకు దారితీస్తోంది. గతం కంటే బైపోల్‌లో 8805 ఓట్లు తక్కువగా రావడం గమనార్హం. దాంతో తెలంగాణలో ఏపీ స్ట్రాటజీ పనిచేయదనే టాక్ పార్టీ నేతల్లో నడుస్తోంది.

టీడీపీ సానుభూతిపరులను ఆకట్టుకోలేకపోయిన బీజేపీ..

బీజేపీ ఈ ఫలితాలు ఎదుర్కోడానికి చాలా కారణాలు ఉన్నాయంటున్నారు. ప్రధానంగా ఈ నియోజకవర్గం పరిధిలో ఉన్న ఆంధ్రా సెటిలర్లు, టీడీపీ సానుభూతిపరుల ఓటర్లు తమవైపు తిప్పుకోవడంతో కమలం పార్టీ నేతలు విఫలమయ్యారనే టాక్ నడుస్తోంది. సీఎం రేవంత్ రెడ్డి సైతం టీడీపీ కేడర్ ను ఆకట్టుకునేలా అనేక ప్రయత్నాలు చేయగా బీజేపీ నుంచి కనీస ప్రయత్నం కూడా జరగని విషయాన్ని ఎత్తిచూపుతున్నారట తెలుగు తమ్ముళ్లు. ఇక ఈ విషయంలో బీఆర్ఎస్ కూడా సీఎం రేవంత్ రెడ్డితో పోటీపడిందని కూడా చెబుతున్నారు. కానీ, బీజేపీ మాత్రం టీడీపీ ఓటర్లకు దగ్గరయ్యే పని ఏదీ చేయకపోవడం వల్ల వారి ఓట్లను కోల్పోవాల్సివచ్చిందనే చర్చ రెండు పార్టీల నేతల్లో నడుస్తుందట.

తెలంగాణలో టీడీపీతో కలిసి నడవడానికి వెనకాడుతున్నారా?

కేంద్రంలో అటు ఏపీలో పొత్తుతో ప్రభుత్వాలను నడుపుతున్న బీజేపీ తెలంగాణలో టీడీపీతో అనుబంధం కొనసాగించడానికి వెనుకాడుతోందన్న ప్రచారం జరుగుతోంది. ప్రధానంగా టీడీపీతో పొత్తు పెట్టుకుని పనిచేస్తే రాజకీయంగా వచ్చే విమర్శలకు ఎలాంటి సమాధానం చేప్పాలో అంతుపట్టక కాషాయ నేతలు సమతమతమవుతున్నారనే చర్చ ఉందట. ఎందుకంటే గతంలో జరిగిన ఎన్నికల్లో టీడీపీతో పొత్తులో వెళ్లిన పార్టీలు పరాజయం పాలయ్యాయి. దీంతో బీజేపీ టచ్ మీ నాట్ అనే ధోరణిలో టీడీపీ కేడర్‌తో బీజేపీ నేతలు వ్యవహరిస్తున్నారనేది పొలిటికల్ సర్కిల్స్‌లో నడుస్తోంది.

ఉమ్మడి జిల్లాలో నష్టపోవాల్సి వస్తుందనే టాక్

తెలంగాణలో టీడీపీ విషయంలో బీజేపీ ఎలా ముందుకు వెళ్లబోతుందనేది చర్చినీయంశంగా మారిందట. బైపోల్‌లో ఫలితం తర్వాత కమలం పార్టీ నేతలు రాబోయే స్థానిక సంస్థలు కావొచ్చు, జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో టీడీపీని దగ్గరకి తీసుకుంటురా%ౌ%లేదా అనేది చర్చకు దారితీస్తుందట. టీడీపీ తెలంగాణలో సంస్థాగతంగా పటిష్టంగా లేకపోయినాఇప్పటకీ గ్రామాల్లోను, గ్రేటర్ పరిధిలోను, కొన్ని జిల్లాల్లో పార్టీకి నిర్ణయత్మక స్థాయిలో బలంగా ఉందనేది పొలిటికల్ విశ్లేషకులు చేప్పే మాట. అటు కేంద్రం, ఇటు ఏపీలోను టీడీపీతో కలిసి పని చేస్తున్న బీజేపీతెలంగాణలో మాత్రం టీడీపీని దూరం పెడితే గ్రేటర్ హైదరాబాద్ కార్పొరేషన్ పరిధిలోని నియోజకవర్గాలతోపాటు ఉమ్మడి జిల్లాలో కొన్ని నియోజకవర్గాల్లో బీజేపీ నష్టపోవాల్సి వస్తుందనే టాక్ నడుస్తుందట.

బైపోల్ రిజల్ట్‌తో ఆసక్తికర చర్చ

బైపోల్ రిజల్ట్‌తో మూడు పార్టీల పొత్తుపై ఆసక్తికర చర్చ నడుస్తుందట. ఉప ఎన్నికల్లో పోటీ చేసేందుకు టీడీపీ సీనియర్ నేతలు అరవింద్ కుమార్ గౌడ్, నందమూరి సుహాసినితో పాటు పలువురు నేతలు పోటీకి ఆసక్తి చూపారట. అయితే చంద్రబాబు మాత్రం పోటీకి విముఖత చూపారు. బీజేపీ సైతం టీడీపీ నేతలను కలుపుకొని పోలేదని సమాచారం. ఈ పరిణామాలతో కూటమి నేతల్లోని అనైక్యత స్పష్టం కనిపించందనే చర్చ నడుస్తుందటఓటు బదాలాయింపులో మూడు పార్టీల నేతల మధ్య సమన్వయం లేకపోవడంతో ఓటమిని చవిచూశారనే ప్రచారం జరుగుతుంది. ఏపీ రాజకీయలకు.తెలంగాణలోని రాజకీయ పరిస్థితుల వేరు అనే చర్చ కమలం పార్టీ నేతల నుంచి వస్తుందట. అందుకే కూటమి పార్టీలైన టీడీపీ, జనసేన పార్టీల విషయంలో అచితూచి వ్యవహరించాల్సి వస్తుందనే వాదన బీజేపీలో వినిపిస్తుందట.

కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య ప్రధాన పోటీ

తెలంగాణలో ఏ ఎన్నికలు వచ్చినా.. అసెంబ్లీ అయినా, స్థానిక , మున్సిపల్

# సునీతకు ఓదార్పు ఏది?

హైదరాబాద్,అల్లుడు అల్లుడే.. పార్టీ పార్టీనే అంటున్నారు ఆ సీనియర్ నేత. రాజకీయం వేరు..కుటుంబం వేరని చెప్పకనే చెప్పారాయన. అల్లుడు, మామ చెరో పార్టీలో ఉండి బైపోల్ ఫైట్ చేసి..ఇప్పుడు ఆత్మీయ ఆలింగనం చేసుకోవడం ఆసక్తికరంగా మారింది. మామా, అల్లుళ్లు ఒకరిని ఒకరు సత్కరించుకోవడం ఇటు కాంగ్రెస్, అటు బీఆర్ఎస్‌లో హాట్ టాపిక్ అవుతోంది. ప్రత్యర్థి పార్టీ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన అల్లుడిని సత్కరించిన సదరు మామ..సొంత పార్టీ నుంచి పోటీ చేసి ఓడిపోయిన మహిళా అభ్యర్థిని మాత్రం కనీసం ఓదార్చకపోవడం చర్చనీయాంశమవుతోంది. ఇంతకీ ఎవరా మామా, అల్లుళు .. ఏంటా కథ.?అల్లుడు కాంగ్రెస్‌లో..మామ బీఆర్ఎస్. ఎన్నికలకు ముందే ఈ చర్చ జరిగింది. తలసాని శ్రీనివాస్ సపోర్ట్ నవీన్ యాదవ్‌కా లేక..బీఆర్ఎస్ క్యాండిడేట్‌కా అన్న టాక్ నడిచింది. అయితే నవీన్ తనకు అల్లుడు అయినా.. బంధుత్వం వేరు రాజకీయం వేరంటూ అప్పట్లోనే క్లారిటీ ఇచ్చే ప్రయత్నం చేశారు తలసాని. హోరాహోరీగా సాగిన బై ఎలక్షన్‌లో కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన నవీన్ యాదవ్..తలసానిని కలవడం ఆసక్తికరంగా మారింది.

తమ్ముడు తమ్ముడే పేకాట పేకాటే..

మామ, అల్లుడు ఇద్దరూ ఒకరిని ఒకరు సత్కరించుకోవడం..ఆత్మీయ ఆలింగనం చేసుకోవడంతో..తమ్ముడు తమ్ముడే పేకాట పేకాటే అన్న సామెతను గుర్తు చేస్తున్నారు నెటిజన్లు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారం సందర్భంగా తలసాని వ్యవహరించిన తీరు డిఫరెంట్‌గానే ఉన్నా..అప్పుడు పెద్దగా చర్చకు రాలేదు. కానీ ఇప్పుడు అధికార కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిచిన నవీన్ యాదవ్, ప్రత్యర్థి పార్టీ ఎమ్మెల్యే అయిన తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కలవడంతో ఇటు కాంగ్రెస్, అటు బీఆర్ఎస్ లో ఆసక్తికరమైన చర్చకు దారితీస్తోంది.జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో గెలిచిన కాంగ్రెస్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్ మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు అల్లుడు అవుతాడన్న సంగతి అందరికీ తెలుసు. తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్న కూతురును నవీన్ యాదవ్ పెళ్లి చేసుకున్నాడు. కాబట్టి నవీన్ యాదవ్, తలసాని చాలా దగ్గరి బంధువులు. ఈ క్రమంలోనే మొన్న జరిగిన జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో తన అల్లుడు నవీన్ యాదవ్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేయడంతో, బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేగా ఉన్న తలసాని శ్రీనివాస్ యాదవ్ కొంత సైలెంట్‌గా ఉండిపోయారు.

అల్లుడు నవీన్ యాదవ్ పేరు తీయాల్సి వస్తుందని..

కేటీఆర్, హరీశ్‌రావు మొదలు మాజీ మంత్రులంతా జూబ్లీహిల్స్ లో మకాం వేసి బీఆర్ఎస్ తరపున ప్రచారం చేసినా..తలసాని మాత్రం అంటీ ముట్టనట్లు ఉండిపోయారన్న టాక్ ఉంది. ఒకటి రెండు సందర్భాల్లో కేటీఆర్ రోడ్ షో లో మాత్రం పాల్గొన్నారాయన. కానీ ఒక్కసారి కూడా బీఆర్ఎస్ ప్రచారంలో మాట్లాడలేదు. తాను మాట్లాడితే కాంగ్రెస్‌ను విమర్శించే క్రమంలో తన అల్లుడు నవీన్ యాదవ్ పేరు తీయాల్సి వస్తుందని తలసాని భావించారట. అందుకే తాను పెద్దగా ప్రచారం చేయనని, తన సామాజిక వర్గం, తన కుటుంబం పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నుంచి దూరంగా ఉంచాలని తలసాని ముందుగానే పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు విజ్ఞప్తి చేసినట్లు ఇన్‌సైడ్ టాక్. కేటీఆర్ కూడా తలసాని పరిస్థితిని అర్థం చేసుకుని

# అబద్దాల ప్రచారంలో కెటిఆర్ దిట్ట



హైదరాబాద్,పదేళ్లు మంత్రిగా పనిచేసిన కేటీఆర్ రాష్ట్ర ప్రజలకు అసత్యాలు చెబుతున్నాని మంత్రి శ్రీధర్‌బాబు విమర్శించారు. తెలంగాణ ప్రభుత్వం సిఎం రేవంత్ నేతృత్వంలో పెట్టుబడుల కోసం, ఉపాధి, ఉద్యోగాల కల్పనకు పెద్ద ఎత్తున కృషి చేస్తున్నదని అన్నారు. అచిర కాలంలోనే తెలంగాణ అనేక విజయాలు సాధించిందని అన్నారు. గత ప్రభుత్వం మాదిరిగా అడ్డగోలుగా జీవోలు, చెల్లింపులు చేయడం లేదని, వారి హయాంలో ఏం చేసినా దాని వెనుక ఓ మతలబు ఉండేదని ఆరోపించారు. శుక్రవారం సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.'మా కేబినెట్‌లో తీసుకున్న నిర్ణయాలపై కేటీఆర్ ఆరోపణలు చేశారు. మొత్తం 9,292 ఎకరాల భూమి గురించి మాట్లాడారు. పరిశ్రమలను ప్రోత్సహించాలని ప్రభుత్వం భూములను తక్కువ ధరకు ఇస్తోంది. 2023లో భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం మూడు జీవోలు ఇచ్చింది. ఆ జీవో ప్రకారం హైదరాబాద్‌లోని భూములను ట్రాన్స్‌ఫర్‌కు అనుమతి ఇచ్చారు. ప్రభుత్వ భూమి అమ్ముకున్నట్టు కేటీఆర్ మాట్లాడుతున్నారు. ఫ్రీహోల్డ్, ల్యాండ్ లీజ్‌కు తేడా లేకుండా మాట్లాడారు. 2023లో భారత రాష్ట్ర సమితి తెచ్చిన జీవో ప్రకారమే భూములు ఇస్తున్నాం. భూమి హక్కులు ఉన్న వారికి మేలు చేయాలని చూస్తున్నాం. గత ప్రభుత్వం హయాంలో చాలా భూములు బదిలీ చేశారు. పరిశ్రమలకు ఉపయోగపడాలని గ్రిడ్ పాలసీ తీసుకున్నారని అనుకున్నాం. పారిశ్రామిక వేత్తలను ఇబ్బంది పెట్టకూడదు. పెట్టుబడులు రావాలని రాయితీలతో కూడిన పాలసీలు తీసుకుంటాం. కొన్ని రాష్ట్రాల్లో 99 పైసలకే భూములు ఇస్తున్నారు. పెట్టుబడులు రావాలి, ఉపాధి పెంచాలి అనేది మా లక్ష్యం. ఫ్రీహోల్డ్ ల్యాండ్ ఉన్నవారు పాలసీ ద్వారా అవకాశం ఉంటే దరఖాస్తు చేసుకుంటారని అన్నారు. భారత రాష్ట్ర సమితి నేతలు అభూత కల్పనలతో రాష్ట్ర ప్రజలకు సత్యదూరమైన మాటలు చెబుతున్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఓటమి తర్వాత ఆ పార్టీ నేతలకు పగలే చుక్కలు కనిపిస్తున్నాయి. పెట్టుబడులు రాకూడదు, రాష్ట్ర అభివృద్ధి జరగకూడదు అనేది కేటీఆర్ ఆలోచన. ఆధారాలు ఉంటేనే మాట్లాడాలి. కేటీఆర్ కొంత మంది పేర్లు చెప్పారు.. వారు ప్రభుత్వంలో లేరు. ఆధారాలు ఉంటే చెప్పండి.. చర్యలు తీసుకుంటాం అని శ్రీధర్‌బాబు తెలిపారు. రాష్ట్ర ప్రగతిని అడ్డుకునేలా అబద్దాల ప్రచారం మానుకోవాలన్నారు. గతంలో లాగా అడ్డగోలు నిర్ణయాలు జరగడం లేదన్నారు. స్వలాభం అన్నదానికి వారు హయాంలో తీసుకున్న నిర్ణయాలే నిదర్శనమని శ్రీధర్ బాబు అన్నారు.

# మావోయిస్టులను పట్టించిన 'అద్దె' బేరం!

విజయవాడ: విజయవాడ నగరంలో పట్టుబడ్డారు 27 మంది మావోయిస్టులు. ఇంటెలిజెన్స్ సమాచారంతోనే వారిని పట్టుకున్నట్లు ప్రచారం నడుస్తోంది. కానీ మావోయిస్టులు చేసిన చిన్న తప్పిదం వల్లే వారు పట్టు పడడం విశేషం. చత్తీస్గడ్ దండకారణ్యంలో భద్రతా బలగాలు దాడులతో పాటు తనిఖీలు ముమ్మరం చేశాయి. ఒడిస్సా సరిహద్దు ప్రాంతాల్లో సైతం పోలీసుల గాలింపులు అధికంగా ఉంది. ఇటువంటి తరుణంలో ఏపీలో తలదాచుకునేందుకు వచ్చిన మావోయిస్టులకు ఇటీవల ఎదురు దెబ్బ తగిలింది. అల్లూరి సీతారామరాజు జిల్లా సరిహద్దు ప్రాంతంలో జరిగిన ఎన్కౌంటర్లో 13 మంది మావోయిస్టులు చనిపోయారు. మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో వరుసగా రెండు రోజులపాటు జరిగిన ఎన్కౌంటర్లో మావోయిస్టు అగ్రనేతలు సైతం చనిపోయారు. అదే సమయంలో విజయవాడ నగరంతో పాటు కాకినాడలో పెద్ద ఎత్తున మావోయిస్టులు పట్టు పడడం విశేషం.

లక్ష రూపాయల అద్దెతో..

విజయవాడ ఆటోనగర్ ప్రాంతంలో మావోయిస్టులు పట్టుబడడం మాత్రం సంచలనం రేగింది. ఆ ప్రాంతంలో ఆటో కార్మికులు అధికం. రవాణా రంగానికి సంబంధించిన లావాదేవీలు ఎక్కువగా జరుగుతుంటాయి. ఈ క్రమంలో ఆటోనగర్ శివారు ప్రాంతంలోని ఒక భవనంలో ఏకంగా 27 మంది మావోయిస్టులు తలదాచుకున్నారు. అయితే వీరు పట్టు పడడం వెనుక వీరి వైఫల్యం ఉంది. ఆ భారీ భవనంలో కింది పర్షన్ వ్యాపార అవసరాలకు అద్దెకు ఇచ్చారు సదరు యజమాని. పై పోర్షన్ అంతా ఓపెన్ హాల్. గత కొద్ది నెలలుగా ఆ హాల్ ఖాళీగా ఉంది. ఈ క్రమంలో అక్కడ హాల్ ను అద్దెకు తీసుకున్నారు కొంతమంది. ఏకంగా లక్ష రూపాయలకు అద్దెకు తీసుకోవడం ఆ ప్రాంతంలో



చర్చకు దారి తీసింది. కొద్ది నెలలుగా ఖాళీగా ఉన్న ఆ భవనం ఏకంగా లక్షలు అద్దెకు వెళ్లడంతో స్థానికులు చర్చించుకోవడం ప్రారంభించారు. ఆ నోటా ఈ నోటా విన్న పోలీసులు దీనిపై దృష్టి పెట్టారు.

తెలిగ్గా ఆలోచించిన మావోయిస్టులు

అయితే మావోయిస్టులు అంత ఈజీగా ఎలా ఆలోచించారో తెలియడం లేదు. ఎందుకంటే ఒకే భవనంలో అంతమంది అద్దెకు దిగితే కచ్చితంగా అనుమానం వస్తుంది. ఆపై ఒకే భవనంలో 27 మంది దిగితే అసాంఘిక కార్యకలాపాల విషయంలో అనుమానం వస్తుంది. ఆపై లక్ష రూపాయల అద్దెకు దిగడం అంటే దీని వెనుక ఏదో ఒకటి ఉందన్న అనుమానం వెంటాడుతుంది. పోలీసులు సైతం ఆ అనుమానంతోనే కూపీ లా గారు. మావోయిస్టులు అన్న విషయాన్ని తెలుసుకున్నారు. ఆ భవనాన్ని చుట్టుముట్టి చాలా తేలిగ్గా 27 మంది మావోయిస్టులను అదుపులోకి తీసుకోగలిగారు.

# త్వరలోనే స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ



హైదరాబాద్,65 ఐటీఐ కళాశాలలను ఏటీసీలుగా మార్చేందుకు తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క తెలిపారు.

హైదరాబాద్ కూకట్‌పల్లిలోని జేఎన్టీయూ డైమండ్ జూబ్లీ వేడుకలకు ముఖ్య అతిథిగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క హాజరయ్యారు. విద్యార్థుల భవిష్యత్తులను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటుందని తెలిపారు. త్వరలోనే స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీని నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. జేఎన్‌టీయూ ఒక విశ్వవిద్యాలయం మాత్రమే కాదని.. ఇది దేశానికి, ముఖ్యంగా తెలంగాణకు గొప్ప ఆస్తి అని పేర్కొన్నారు. ఇంజనీర్లను తయారు చేసే శక్తివంతమైన దేశ ఇంజిన్ అని ప్రశంసించారు. విద్యార్థుల ప్రతిభ ప్రపంచానికి ఎంతో గర్వకారణమన్నారు. విద్య అనేది ఖర్చు కాదని, భవిష్యత్తును నిర్మించే పెట్టుబడని విద్యార్థులకు భట్టి విక్రమార్క సందేశం ఇచ్చారు. ఉద్యోగాలు వెతికే వారిగా కాకుండా ఉద్యోగాలు సృష్టించే వారిగా ఎదగాలని సూచించారు. మొదటి 60 ఏళ్ల కంటే, వచ్చే 60 ఏళ్లు మరింత మహోన్నతంగా ఉండాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కోరారు.

# మళ్లీ మొదలెట్టింది.. భారత కంపెనీలపై అమెరికా ఆంక్షలు

న్యూఢిల్లీ,రష్యా నుంచి భారత్ ఆయిల్ కొనుగోలు చేయడం కారణంగానే రష్యా ఉక్రోయిన్‌పై యుద్ధం కొనసాగిస్తోందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పలుమార్లు ఆరోపించారు. భారత్‌పై ఆంక్షలు విధించాలని యురోపియన్ యూనియన్ కోరారు. ఆయిల్ దిగుమతులను సాకుగా చూపి 25 శాతం అదనపు సుంకాలు విధించారు. అయితే భారత్ రష్యా నుంచి ఆయిల్ కొనుగోళు నిలిపివేసింది. అయినా సుంకాలు తొలగించలేదు. రష్యాలోని ఆయిల్ కంపెనీలపై ఆంక్షలు విధించారు. అందులో మనకు ఇంధనం సరఫరా చేసే కంపెనీసైతం ఉంది. ఇక ఇప్పుడు తాజాగా ఇరాన్ చమురు సరఫరాపైంక్షలు విధించారు. ఈ క్రమంలో భారత కంపెనీలపైగా ఆంక్షలు విధించారు.

ఇరాన్ టార్గెట్‌గా..

అమెరికా ప్రభుత్వం ఇరాన్ ముడి చమురును వివిధ దేశాలకు సరఫరా చేయకుండా అడ్డుకొనేందుకు పలు సంస్థలు, వ్యక్తులపై ఆంక్షలు విధించింది. ఈ జాబితాలో భారతదేశంలోని టీఆర్6 పెట్రో కంపెనీ, ఆర్ఎన్ షిప్ మేనేజ్మెంట్ సంస్థలతో పాటు కొంతమంది వ్యక్తుల పేర్లు కూడా ఉన్నాయి. ఈ చర్యలు ఇరాన్ సైనిక కార్యకలాపాలకు నిధులు నిలిపివేసేందుకు, అణ్వాయుధ అభివృద్ధి, ఉగ్రవాద ప్రాక్సీలకు మద్దతు అందకుండా చేయడమనే లక్ష్యంతో చేపట్టబడుతున్నాయి.

విమాన సర్వీస్‌లపైనా..

ఇరాన్‌కు చెందిన ప్రముఖ ప్రైవేటు ఎయిర్‌లైన్స్, మహాన్‌ఎయిర్, యాజ్డ్ ఇంటర్నేషనల్ ఎయిర్వేస్‌పై కూడా ఆంక్షలు విధించారు. ఈ విమానయాన సంస్థలు ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్(ఐఆర్‌జీసీ)తో సన్నిహితంగా పనిచేస్తున్నాయని ఆరోపణలు ఉన్నాయి. సిరియా, లెబనాన్‌లోని ఇరానియన్



ప్రాక్సీలకు ఆయుధాలు, సిబ్బంది రవాణాకు ఈ సంస్థలు సహకరిస్తున్నట్లు తెలిపింది. ఈ ఆంక్షల వల్ల ఇరాన్ ఆర్థిక ఒత్తిడిలో పడిపోయే అవకాశం ఉన్నదని విశ్లేషకులు అంటున్నారు. భారత సంస్థలపై పెట్టిన చర్యలు, ఆర్థిక కార్యకలాపాల్లో అంతర్జాతీయ నియమాలపై ఇబ్బందులను సూచిస్తున్నాయి.

## అక్రమార్జన కేసులో సూర్యకళ అరెస్ట్

అమరావతి,అక్రమార్జన కేసులో రాష్ట్ర వైద్య మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ జనరల్ మేనేజర్ మల్లాది వెంకట సూర్యకళను అవినీతి నిరోధకశాఖ అధికారులు అరెస్టు చేశారు. అక్రమంగా ఆస్తులు కూడబెట్టారనే అభియోగాలపై వచ్చిన సమాచారం మేరకు హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడలోని సూర్యకళకు చెందిన, బంధువుల ఇళ్లల్లో సోదాలు జరిపారు. నాలుగు చోట్ల ఏకకాలంలో తనిఖీలు నిర్వహించారు. ఇంకా ఈ సోదాలు కొనసాగుతున్నాయి. ఇప్పటివరకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు, వ్యవసాయ భూములకు సంబంధించి 27 డాక్యుమెంట్లను

# బండి వర్సెస్ ఈటల.. తెలంగాణ బీజేపీలో చీలిక స్పష్టం!

హైదరాబాద్,తెలంగాణలో బీజేపీ ప్రస్థానం ఒక అడుగు ముందుకు రెండడుగులు వెనక్కు అన్న చందంగా ఉంది. ఇందుకు ప్రధాన కారణం నేతల మధ్య సయోధ్య లేకపోవడమే.. సయోధ్య లేకపోవడం ఒక్కటే కాదు.. రాష్ట్ర పార్టీ నేతలలో విభేదాలు తరచూ బహిర్గతమౌతున్నాయి. అంతే కాదు.. ఈ నేరుగా పేరు పెట్టి మరీ ఒకరినొకరు బహిరంగంగా విమర్శలకు దిగేంతగా ఈ విభేదాలు ముదిరి పాకాన పడ్డాయి. ఇంత కాలం తెలంగాణ బీజేపీలో అంతర్గత కుమ్ము లాటలు,నాయకుల మధ్య విభేదాలు, వివాదాలు సాగుతూనే ఉన్నాయి. అయితే జూబ్లీ ఉప ఎన్నిక ఫలితం తరువాత అవి రచ్చెక్కాయి. రాష్ట్రంలో అధికారమే తరువాయి అన్న పరిస్థితి నుంచి జూబ్లీ ఉప ఎన్నికలో డిపాజిట్ కూడా గల్లంతయ్యే పరిస్థితికి బీజేపీ దిగజారిపోవడానికి ప్రధాన కారణం ఆ పార్టీ రాష్ట్రనాయకుల మధ్య సయోధ్య లేమే అన్న విషయంలో ఎలాంటి సందేహం లేదు. అసలు ఈ పరిస్థితికి కారణమేంటి? నాయకుల మధ్య విభేదాల వెనుక ఉన్న అసలు సిసలు రీజనేంటి? అని పరిశీలిస్తే.. సాధారణంగా బీజేపీలోకి బయట నుంచి వచ్చి చేరిన వారు ఇమడ లేరు. హిందుత్వ భావజాలం, ఆర్ఎస్ఎస్ బీజేపీకి మెంటార్ గా వ్యవహరించడం.. అన్నిటికీ మించి బీజేపీలోకి బయటి పార్టీలకు వచ్చిన వారిని తొలి నుంచీ పార్టీలో ఉన్నవారు మనస్ఫూర్తిగా కలుపుకునే పరిస్థితి లేకపోవడం సహజపరిణామం. అయితే బీజేపీ నాయకత్వం మోడీ, షా చేతులలోకి వచ్చిన తరువాత పార్టీలో ఆ పరిస్థితి మారిపోయింది. సిద్ధాంతం కంటే ఓట్లు, సీట్ల లెక్కలకే బీజేపీ హైకమాండ్ ప్రాధాన్యం ఇవ్వడంతో దేశ వ్యాప్తంగా బీజేపీకీ ఇతర పార్టీలకీ, మరీ ముఖ్యంగా కాంగ్రెస్ కూ తేడా లేని పరిస్థితి ఏర్పడింది. దీంతో పార్టీలో తొలి నుంచి ఉన్నవారూ, తరువాత వచ్చి చేరిన వారి మధ్య అగాధం ఏర్పడింది. అది పెరుగుతూ వస్తోంది. మిగిలిన అన్ని రాష్ట్రాల కంటే తెలంగాణలో ఈ పరిస్థితి మరింత ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. జూబ్లీ ఉప ఎన్నికలో ఘోర పరాజయం తరువాత ఈ విభేదాలు నివురు తొలగించుకుని నిప్పులా బహిర్గతమయ్యాయి. ముఖ్యంగా మల్కాజ్ గిరి ఎంపీ ఈటల రాజేందర్, కేంద్ర మంత్రి బండి సంజయ్ ల మధ్య సైద్ధాంతిక అంతరం



ఈ విభేదాలు రాజీకి ఆస్కారం లేనంత తీవ్ర స్థాయికి చేరడానికి కారణమయ్యాయి. బండి సంజయ్ నూటికి పదహారణాల హిందుత్వ వాది. ఈటల రాజేందర్ రాజకీయ నేపథ్యం ఇందుకు పూర్తి భిన్నం. ప్రాణం ఉన్నంతవరకు హిందూత్వమే తన మార్గమని బండి సంజయ్ అంటే.. మతతత్వం ఇక్కడ నడవదని ఈటల కుండబద్దలు కొడతారు. బరాబర్ హిందుత్వ అజెండాతో ఎన్నికలో పోటీ చేయడం కరెక్టు కాదంటారు. అలా పోటీ చేస్తే ఇదిగో ఇలా డిపాజిట్లు గల్లంతౌతాయని ఈటల ఎలాంటి శషబిషలూ లేకుండా కుండబద్దలు కొట్టేశారు. జూబ్లీలో బీజేపీకి డిపాజిట్ గల్లంతు కావడానికి హిందుత్వ అజెండాయే కారణమని విస్పష్టంగా ప్రకటించారు. ఈ సందర్భంగా ఈటల నేరుగా బండి సంజయ్ పేరు ప్రస్తావిస్తూ ఆయన మతతత్వ అతివాద ధోరణితో చేసిన ప్రచారమే జూబ్లీలో బీజేపీ అభ్యర్థికి డిపాజిట్ గల్లంతు కావడానికి కారణమని చెప్పడమే కాకుండా, ప్రచార అజెండాలో మతం ప్రస్తావన లేకుండా ఉంటే ఫలితం మెరుగ్గా ఉండేదని చెప్పారు. ఈ నేపథ్యంలో బండి వర్సెస్ ఈటల వ్యవహారం రాష్ట్ర పార్టీలో స్పష్టమైన చీలికను స్ఫురింప చేస్తున్నాయని పరిశీలకులు అంటున్నారు.

# హమాస్ తరహాలో దాడులు..ఆయుధాల సమీకరణ



న్యూఢిల్లీ,ఢిల్లీ పేలుడు ఘటనపై అధికారులు ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నారు. దర్యాప్తులో భాగంగా అరెస్టయిన టెర్రర్ వైద్యులను విచారిస్తున్నారు. ఈ విచారణలో వైట్ కాలర్ టెర్రర్ మాడ్యూల్ కుట్రలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. ఇజ్రాయెల్‌పై 2023 అక్టోబర్ 7న హమాస్ ఉగ్రవాదులు జరిపిన దాడి తరహాలో ఢిల్లీలోని రద్దీ ప్రదేశాల్లో దాడులకు కుట్ర పన్నినట్లు తేలిన విషయం తెలిసిందే. తాజాగా మరో విషయం వెలుగులోకి వచ్చింది. హమాస్ తరహాలోనే ఆయుధాలను దాచేందుకు ఈ వైట్ కాలర్ ఉగ్ర ముఠా ఆసుపత్రులను ఎంచుకున్నట్లు తేలింది. ఇజ్రాయెల్‌తో యుద్ధం సమయంలో గాజాలోని పలు ఆసుపత్రుల కింద హమాస్ స్థావరాలు బయటపడిన సంగతి తెలిసిందే. పెద్ద ఎత్తున పేలుడు పదర్థాలు, ఆయుధాలను ఆసుపత్రుల కింద డంప్ చేసినట్లుగా ఐడీఎఫ్ గుర్తించింది. అదే తరహాలో జమ్ము ఆసుపత్రుల కింద ఆయుధ డంప్‌ను ఏర్పాటు చేసేందుకు వైట్ కాలర్ టెర్రర్ కుట్ర పన్నినట్లు అధికారులు గుర్తించారు. ఢిల్లీ పేలుడు, ఫరీదాబాద్ ఉగ్ర మాడ్యూల్‌తో సంబంధం ఉన్న వైద్యులు మొహమ్మద్ షకీల్, అదిల్ అహ్మద్ రాథర్, షాహీన్ సయీద్‌ను దర్యాప్తు అధికారులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్న విషయం తెలిసిందే. వీరిలో షకీల్, షాహీన్ ఫరీదాబాద్‌లోని అల్ ఫలాహ్ ఆసుపత్రిలో పనిచేస్తున్నారు. ఇక అహ్మద్ రాథర్ మాత్రం జమ్ము కశ్మీర్ అనంత్‌నాగ్‌లోని ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఉద్యోగి. అతడిని విచారించగా ఈ ఆయుధ డంప్ కుట్ర విషయం బయటపడింది. విదేశాల నుంచి ఇంపోర్ట్ చేసుకున్న ఆయుధాలను దాచేందుకు అనంత్‌నాగ్, శ్రీనగర్, బారాముల్లా, బుద్గాం, నౌగమ్‌లోని ఆసుపత్రులను ఈ ఉగ్ర మాడ్యూల్ పరిశీలించినట్లు దర్యాప్తులో తేలినట్లు సంబంధిత వర్గాలు తాజాగా వెల్లడించాయి. మరోవైపు ఈ కేసు దర్యాప్తులో హమాస్ తరహాలో డ్రోన్లతో దాడులకు కుట్ర పన్నినట్లు వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే. ఎర్ర కోట వద్ద ఈ నెల 10న ఆత్మాహుతి దాడికి ముందు ఈ ఉగ్ర ముఠా భారీ ఆయుధాలతో కూడిన డ్రోన్లతో రద్దీ ప్రదేశాల్లో దాడులు చేయాలని ప్రణాళిక రచించింది. ఇజ్రాయెల్‌పై 2023 అక్టోబర్ 7న హమాస్ ఉగ్రవాదులు జరిపిన దాడి తరహాలో దాడులకు పాల్పడాలని వీరు ప్రయత్నించారు. సూసైడ్ బాంబర్, డాక్టర్ ఉమర్ ఉన్ నబీతో కలిసి పని చేసిన జసిర్ బిలాల్ వానీ వురపు డానిష్ ఈ భయానక వివరాలను వెల్లడించాడు. ఇతనిని జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) బృందం శ్రీనగర్‌లో అరెస్ట్ చేసింది. కారు బాంబు పేలుడుకు ముందే, డ్రోన్లకు భారీ ఆయుధాలను అమర్చి, రాకెట్లను తయారు చేసి, రద్దీ ప్రదేశాల్లో దాడులకు పాల్పడేందుకు సాంకేతిక సహకారాన్ని డానిష్ అందించాడని ఎన్ఐఏ ఓ ప్రకటనలో తెలిపింది. సూసైడ్ బాంబర్ ఉమర్‌తో సహ కుట్రదారుగా డానిష్ పని చేసినట్లు తెలిపింది. మీడియా కథనాల ప్రకారం, పెద్ద బ్యాటరీలతో అత్యంత శక్తిమంతమైన బాంబులను తీసుకెళ్లగలిగే డ్రోన్లను తయారు చేయడానికి డానిష్ ప్రయత్నించాడు. ఆయుధాలతో కూడిన డ్రోన్లను తయారు చేయడంలో అతనికి అనుభవం ఉంది. రద్దీ ప్రదేశాల్లో డ్రోన్ల దాడి చేయాలని నిందితులు ప్రయత్నించారు.

# ప్రభుత్వ వైఫల్యాలు ఎత్తి చూపినందుకే కక్షసాధింపు

హైదరాబాద్,అనునిత్యం ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపుతున్నందుకే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై కాంగ్రెస్ సర్కారు కక్ష సాధిస్తున్నదని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ మండిపడ్డారు. ఫార్ములా- ఈ రేస్ కేసులో కేటీఆర్ ప్రాసిక్యూషన్‌కు గవర్నర్ అనుమతి ఇవ్వడం కక్ష సాధింపు చర్య అని ధ్వజమెత్తారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రతీకార రాజకీయదాడిలో భాగంగా కేటీఆర్‌పై ఈ కార్ రేస్ కేసును తెరపైకి తెచ్చాడని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. కేంద్రంలోని బీజేపీతో చీకట్లో చేతులు కలిపి బీఆర్ఎస్‌పై కాంగ్రెస్ కుట్రలు చేస్తున్నారని, ఫార్ములా ఈ కేసులో చట్టపరమైన స్థిరత్వం, వాస్తవ ఆధారాలు, సాక్ష్యాలు లేవు, ఫార్ములా ఈ రేస్‌పై గతంలో లైడిటెక్టర్ టెస్ట్‌కు సిద్ధమని కేటీఆర్ చేసిన సవాల్‌కు రేవంత్ రెడ్డి తోకముడిచాడని ఆరోపించారు.రెండేండ్లుగా ఫార్ములా ఈ రేస్‌పై విచారణ పేరిట సాగదీస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం సాధించింది ఏమీ లేదని ఆయన అన్నారు. స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను నిలువరించేందుకు మరోసారి ఈ-కార్ రేస్ కేసు పేరిట కుట్రలను తెరపైకి తెచ్చిందని హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను పెంచిన కేటీఆర్‌పై రేవంత్‌రెడ్డి అక్రమ కేసులు బనాయించి ఇబ్బంది పెట్టడమే లక్ష్యంగా పెట్టుకుని రెండు జాతీయ పార్టీలు పని చేస్తున్నాయని ఆరోపించారు. కేటీఆర్‌ను ప్రజాక్షేత్రంలో ఎదుర్కొనే దమ్ములేకే కుట్రలకు తెగబడుతున్నాయని మాజీ మంత్రి మండిపడ్డారు.దేశంలో కాంగ్రెస్, బీజేపీలు కేంద్రంలో బద్ధ శత్రువులు కానీ, తెలంగాణలో మాత్రం వారిది అన్నదమ్ముల అనుబంధం అని అన్నారు. ప్రాంతీయ పార్టీలను, యువ నాయకత్వాన్ని రాజకీయంగా నిర్మూలించడం, ప్రాంతీయ పార్టీలను బలహీనపరచడమే జాతీయ పార్టీలు కాంగ్రెస్, బీజేపీ ఎజెండా అని ఆరోపించారు. నిన్నటికి నిన్న బీహార్‌లో ఆర్జేడీని కాంగ్రెస్, బీజేపీలు కలిసి మట్టికరిపించాయని, అలాగే యూపీలో సమాజ్‌వాదీ పార్టీని, కర్ణాటకలో జేడీఎస్‌ను, ఢిల్లీలో ఆప్‌ను, మహారాష్ట్రలో ఎన్సీపీ, శివసేనలను ఇంకా అనేక ప్రాంతీయ పార్టీలను పూర్తిగా బలహీన పరిచాయని గుర్తు చేశారు.దేశంలో యువ నాయకత్వం ఎదుగుదలను నిరోధించడమే మోదీ-బీజేపీల ఎజెండా. అందుకే అఖిలేష్ యాదవ్, తేజస్వీ యాదవ్, కేటీఆర్, ఉదయనిధి స్టాలిన్ వంటి యువ నేతలను బీజేపీ టార్గెట్ చేసి ందని, ఉత్తరాదిలో అనుసరించిన వ్యూహాన్నే తెలంగాణలోనూ బీజేపీ-కాంగ్రెస్ పార్టీలు అనుసరిస్తున్నాయని, అందులో భాగంగానే తెలంగాణలో కేసీఆర్ కుటుంబాన్ని ఇబ్బందులు పెట్టేందుకు జాతీయ స్థాయిలో బద్ధ విరోధులు ఆప్తమిత్రులు అయ్యారు. దర్యాప్తు సంస్థలను గుప్పిట్లో పెట్టుకొని బీఆర్ఎస్ నేతలపై రాజకీయ ప్రేరేపిత కేసులు పెడుతున్నారు. ఈ క్రమంలోనే ఫార్ములా ఈ- రేస్‌ను పదే పదే తెరపైకి తెస్తున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు విచారణ పేరుతో కేసీఆర్‌ను



వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.స్థానిక ఎన్నికల నేపథ్యంలోనే రేవంత్, బీజేపీలు కలిసి మళ్లీ ఈ-కార్ రేస్‌ను తెరపైకి తీసుకువచ్చారని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను మోసం చేసింది. 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని నమ్మించి గొంతుకోసింది. ఇచ్చిన హామీని తుంగలో తొక్కి, మాటమార్చి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వడం సాధ్యం కాదని తేల్చేసింది. రాజ్యాంగబద్ధంగా కాకుండా, పార్టీ పరంగా బీసీలకు రిజర్వేషన్లు ఇస్తామని బీసీ సమాజాన్ని తడిగుడ్డతో గొంతుకోసింది కాంగ్రెస్ ప్రభుత్వం. అటు బీసీ రిజర్వేషన్ల కోసం బీఆర్ఎస్ పార్టీ ప్రత్యక్ష పోరాటం చేస్తున్నది. అందుకే డైవర్షన్ రాజకీయాలు, డ్రామాల పాలిటిక్స్‌కు స్థానిక సంస్థల ఎన్నికల వేళ ఈ-రేస్‌ను తెరపైకి తీసుకువ చ్చారని అన్నారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ ద్రోహంపై, రేవంత్ నయవంచక పాలనపై ప్రజల్లో చర్చ జరగకుండా మీడియా అటెన్షన్ మొత్తం ఈ-రేస్ చుట్టే ఉండాలని రేవంత్ కుట్రలు చేస్తున్నాడని రేవంత్ రెడ్డి మండిపడ్డారు.

## ట్రేడ్ లైసెన్స్ ఫీజులో మోసం

హైదరాబాద్, అన్నపూర్ణ స్టూడియో, రామానాయుడు స్టూడియోలకు జిహెచ్ఎంసి నోటీసులు జారీ చేసింది. ఇరు సంస్థలు ట్రేడ్ లైసెన్స్ ఫీజ్ తక్కువగా చెల్లిస్తున్నాయని, వ్యాపార విస్తీర్ణం తక్కువ చూపిస్తూ భారీగా ట్యాక్స్ ఎగవేస్తున్నట్లు జిహెచ్ఎంసి అధికారులు గుర్తించి శుక్రవారం నోటీసులిచ్చారు. పూర్తి స్థాయిలో ట్రేడ్ లైసెన్స్ ఫీజు చెల్లించాలంటూ జిహెచ్ఎంసి అధికారులు నోటీసులిచ్చారు. తెలుగు రాష్టాల్లో్ర పరిచయం అవసరం లేని అన్నపూర్ణ, రామానాయుడు సంస్థలు ట్యాక్స్ ఎగవేస్తున్నాయంటూ వార్తలు రావడం చర్చనీయాంశంగా మారింది. అయితే ఇంతవరకు ఆ రెండు సంస్థల నుండి ఎలాంటి స్పందన రాలేదు. అన్నపూర్ణ స్టూడియో లక్షా 92 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో వ్యాపారం చేస్తూ కేవలం 8 వేల100 చదరపు అడుగులకు మాత్రమే ట్యాక్స్ పే చేస్తున్నట్లు

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com